# ప్రజాపక్షం జిల్లా అనుబంధం

కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి

మంగళవారం | 14 ఏప్రిల్, 2026 | పేజీలు :08


## పిసిసి చీఫ్‌ను కలిసిన మున్నూరుకాపు ప్రతినిధులు



**ప్రజాపక్షం/నిజామాబాద్:**సంఘం అభివృద్ధికి నిధులు కేటాయించాలని అధ్యక్షులు వరాల రాజేందర్, ప్రధాన కార్యదర్శి అంగిరేకుల సాయిలు కోరారు. కోటగల్లి మున్నూరుకాపు సంఘం మైసమ్మ వీధి తర్ప నూతన కమిటీ రాష్ట్ర పీసీసీ చీఫ్ బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్‌ను సోమవారం ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. పీసీసీని కలిసిన వారిలో రాజేందర్, సాయిలు, నరేష్, నవీన్‌కుమార్, గంగాధర్, విజయ్‌కుమార్, ప్రవీన్, భూమేష్, అజయ్ కుమార్ సంఘ సభ్యులు పాల్గొన్నారు. 2026–2028కి గాను కోటగల్లి మున్నూరుకాపు సంఘం మైసమ్మ వీధి తర్ప నూతన అధ్యక్షులుగా వర్గాల రాజేందర్, ప్రధాన కార్యదర్శిగా అంగిరేకుల సాయిలు, కోశాధికారిగా ఆకుల నరేష్, ఉపాధ్యక్షులుగా కొడిగెల భూపతి, సంయుక్త కార్యదర్శిగా సల్ల నవీన్‌కుమార్, సభ్యులుగా సందానాల సాయిలు, ఏనుగుల విజయ్, పబ్బు భూమేష్, ముచ్కూర్ అజయ్‌కుమార్, నీలం ప్రవీన్, ఆకుల సత్యం, ముఖ్య సలహాదారులుగా పోశమల్లు, గంగాధర్, రాజన్నలను ఎన్నుకున్నారు.

# శ్రీపాదరావు ఆశయాలను విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలి

### మంత్రి శ్రీధర్ బాబు



**ప్రజాపక్షం/మంథని :** మహోన్నత వ్యక్తిత్వం, రాజకీయ హుందాతనం గల మాజీ స్పీకర్ స్వర్గీయ దుద్దిళ్ల శ్రీపాద రావు జీవిత చరిత్రను నేటి తరం విద్యార్థులు అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. శ్రీపాద రావు 27వ వర్ధంతి సందర్భంగా డి.ఎస్. ఆర్ యువసేనవ్యవస్థాపక అధ్యక్షుడు బండ కిశోర్ రెడ్డి ఆధ్వర్యంలో మంథని మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల విజేతలకు సోమవారం మంత్రి బహుమతులు ప్రదానం చేశారు.శ్రీ పాద రావు జీవిత చరిత్ర అనే అంశంపై నిర్వహించిన ఈ వ్యాసరచన పోటీల్లో మంథని మండల వ్యాప్తంగా వందలాది మంది విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. శ్రీ పాద రావు రాజకీయ ప్రస్థానం, ఆయన చేసిన అభివృద్ధి పనులు, ప్రజా సేవలో ఆయన పాటించిన విలువలను విద్యార్థులు తమ వ్యాసాల్లో అద్భుతంగా వివరించారు.సోమవారం మంథనిలో జరిగిన కార్యక్రమంలో విజేతలకు మంత్రి శ్రీధర్ బాబు స్వయంగా బహుమతులు మరియు ప్రశంసా పత్రాలను అందజేసి, విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే సామాజిక స్పృహ కలిగి ఉండాలని, శ్రీపాద రావు లాంటి మహనీయుల జీవితాలను స్ఫూర్తిగా తీసుకుని ఉత్తమ పౌరులుగా ఎదగాలని పిలుపునిచ్చారు. ఇలాంటి వినూత్న కార్యక్రమాన్ని చేపట్టిన బండ కిశోర్ రెడ్డిని, డి.ఎస్.ఆర్. యువసేన సభ్యులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు.ఈ బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమంలో డి. ఎస్ .ఆర్. యువసేన వ్యవస్థాపక అధ్యక్షుడు బండ కిశోర్ రెడ్డి, పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, విద్యార్థులు మరియు తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రజావాణి అర్జీలు

# పెండింగ్‌లో పెట్టవద్దు



కలెక్టర్ గరిమ అగ్రవాల్

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** ప్రజావాణి అర్జీలు పెండింగ్ లో పెట్టవద్దని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో సోమవారం ప్రజావాణి నిర్వహించగా, జిల్లా కలెక్టర్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ప్రజావాణికి మొత్తం 270 దరఖాస్తుల రాగా, వాటిని సంబంధిత శాఖల అధికారులకు అందజేసి.. వాటిని పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లా ప్రణాళిక అధికారి, సీ,డీ,ఈ సెక్షన్, తహసీల్ ఆఫీస్ రుద్రంగి, తహసీల్ ఆఫీస్ సిరిసిల్ల, అటవీ శాఖ, జిల్లా ఎక్సైజ్ అధికారి, వేములవాడ శ్రీ రాజరాజేశ్వర ఆలయ ఈఓ, ఆర్ అండ్ బీ, జీజీహెచ్ సిరిసిల్ల, మున్సిపల్ కమిషనర్ వేములవాడ, జిల్లా ఎస్సీ సంక్షేమ అధికారి, జిల్లా పశు సంవర్ధక అధికారి, జిల్లా మైనింగ్ అధికారి, సబ్ రిజిస్ట్రార్ సిరిసిల్ల, డీపీఆర్ఓ, జిల్లా వ్యవసాయ అధికారి, సహకార అధికారికి ఒకటి చొప్పున, జిల్లా పౌర సరఫరాల అధికారి, నీటి పారుదల శాఖ, జిల్లా వైద్యాధికారి, తహసీల్ ఆఫీస్ చందుర్తి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కు 2 చొప్పున, జిల్లా విద్యాధికారి, తహసీల్ ఆఫీస్ వేములవాడ, బోయినపల్లికి 3 చొప్పున, ఉపాధి కల్పన అధికారి, తహసీల్ ఆఫీస్ గంభీరావుపేట, ఆర్డీఓ వేములవాడకు 4 చొప్పున, విద్యుత్ శాఖ, ఎస్పీ కార్యాలయం, తహసీల్ ఆఫీస్ ఎల్లారెడ్డిపేట, ముస్తాబాద్ కు 5 చొప్పున, జిల్లా సంక్షేమ అధికారి, తహసీల్ ఆఫీస్ వేములవాడ రూరల్, కోనరావుపేట, ఆర్డీఓ సిరిసిల్లకు 6 చొప్పున, తహసీల్ ఆఫీస్ తంగళ్ళపల్లి, ఇల్లంతకుంటకు 7 చొప్పున, మున్సిపల్ కమిషనర్ సిరిసిల్లకు 8, జిల్లా పంచాయతీ అధికారికి 13, గృహ నిర్మాణ శాఖకు 68, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారికి 73 వచ్చాయి. ప్రజావాణిలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, ఆర్డీఓలు వెంకటేశ్వర్లు, రాధాభాయి, హౌసింగ్ పీడీ వెంకట మాధవ రావు తదితరులు పాల్గొన్నారు.

# నిర్మల్ వ్యాప్తంగా మొదలైన ‘అరైవ్ అలైవ్’

### రోడ్ సేఫ్టీ అవగాహన సదస్సులో పాల్గొన్న కలెక్టర్, ఎస్పి

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్:** రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించి ప్రజల ప్రాణ భద్రతను కాపాడాలనే లక్ష్యంతో తెలంగాణ పోలీస్ శాఖ,రవాణా శాఖలు సంయుక్తంగా ''అరైప్ అలైవ్'' పేరిట జిల్లా వ్యాప్తంగా ఈ రోజు నుండి వారం రోజుల పాటు(ఏప్రిల్ 13 నుండి 18 వరకు) రోడ్డు భద్రతా అవగాహన కార్యక్రమాలు నిర్వహించ బడుతాయి.ఇందులో భాగంగా ఈరోజు సారంగాపూర్ మండలం ధని గ్రామంలో ఏర్పాటు చేసిన రోడ్ సేఫ్టీ అవగాహన సదస్సులో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ,జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల పాల్గొన్నారు.జిల్లా కలెక్టర్,జిల్లా ఎస్పీ ‘అరైవ్ అలైవ్ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశ్యాన్ని ప్రజలకు వివరిస్తూ ట్రాఫిక్ నిబంధనలు,రక్షణాత్మక డ్రైవింగ్(డిఫెన్సివ్ డ్రైవింగ్) నియమాలు,అలాగే హెల్మెంట్ ధరించడం యొక్క ప్రాముఖ్యత గురించి పోలీసులు ప్రజలకు అవగాహన కల్పించి,రోడ్డు భద్రతకు సంబంధించి బ్రోచర్ లు విడుదల చేయడం జరిగింది.దీంతో పాటు జిల్లాలోని ప్రతీ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ అరైవ్ అలైవ్ కార్యక్రమం నిర్వహించారు.ఇందులో భాగంగా జిల్లాలోని అన్ని మండలాల పరిధిలోని గ్రామాల్లో,గ్రామ సభలను నిర్వహించి గ్రామ స్థాయి కమిటీలను ఏర్పాటు చేయడం జరిగింది,గ్రామాల్లోని కమిటీ సభ్యులతో రహదారి భద్రతపై ప్రమాణం చేయించడంతో పాటు ట్రాఫిక్ నిబంధనల ప్రాముఖ్యతను వివరించారు.ముఖ్యంగా హెల్మెట్ వినియోగం,వేగ పరిమితులను పాటించడం,మద్యం సేవించి వాహనం నడపకూడదనే అంశాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించారు.

**ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల మాట్లాడుతూ.**

ప్రమాదాల తగ్గింపునకు తారక మంత్రం డిఫెన్సివ్ డ్రైవింగ్ అని,ఈ డిఫెన్సివ్ డ్రైవింగ్ నియమాలు పాటించడం వలన చాలా వరకు రోడ్డు ప్రమాదాలను తగ్గించవచ్చని,ఎవరు కూడా ట్రిపుల్ రైడింగ్ చేయవద్దని,మద్యం సేవించి వాహనాలు నడపరాదని, అంతేకాకుండా మొబైల్ ఫోన్ వినియోగిస్తూ డ్రైవ్ చేయరాదని,ప్రతి ఒక్కరు రోడ్డు భద్రతా నియమాలు.. పాటించాలని జిల్లా ఎస్పీ డా.జి జానకి షర్మిల తెలిపారు. ఈ రోడ్డు భద్రత అవగాహన సదస్సులో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ జిల్లా ఎస్పీ డా.జి.జానకీ షర్మిల, ఏఎస్పీ సాయి కిరణ్,జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్,రవాణా శాఖ అధికారి మహేందర్, సంధ్యా రాణి, లక్ష్మీ కాంత్‌రావు, ఇన్స్పెక్టర్ కృష్ణ, ఎస్ఐ శ్రీకాంత్, రవాణా శాఖ అధికారులు సర్పంచ్,ఉప సర్పంచ్, ప్రజా ప్రతినిధులు, రోడ్ సేఫ్టీ కమిటీ సభ్యులు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# ఐవివై పాఠశాలలకు జాతీయస్థాయిలో గౌరవం

ప్రజాపక్షం/కరీంనగర్‌టౌన్: నేషనల్ స్కూల్ అవార్డ్స్ 2006లో భాగంగా ఐవివై పాఠశాలకు దక్షిణ భారతదేశంలోని టాప్ 50 ఫ్యూచరిస్టిక్ ప్రొగ్రెసివ్ స్కూల్స్ జాబితాలో చోటు దక్కింది. ఈ ప్రతిష్టాత్మక గౌరవం ఐవి పాఠశాల అకాడమిక్ ఎక్సలెన్స్, ఇన్నోవేటివ్ బోధన విధానాలు, సంపూర్ణ విద్య పట్ల ఉన్న తిరుగులేని నిబద్ధతకు గుర్తింపుగా లభించిందని చైర్మన్ పసుల మహేష్ తెలిపారు. పాఠశాలలో అమలు చేస్తున్న అకాడమిక్ ఎక్సలెన్స్ ప్రోగ్రామ్స్, ఇన్నోవేటివ్ టీచింగ్ విధానాలు, టెడ్ ఎడ్ టాక్స్, ఫైనాన్షియల్ లిటరసీపై ప్రత్యేక శిక్షణ, విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి దోహదపడే ప్రత్యేక క్రీడలు ప్రదర్శన కళలపై దృష్టి ఈ అవార్డుకు ప్రధాన కారణాలుగా నిలిచాయన్నారు. జాతీయస్థాయిలో పాఠశాలకు గుర్తింపు ఇచ్చే అవార్డుల బోర్డుకు ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఐవి పాఠశాల విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని నూతన విధానాలతో ముందుకు సాగుతుందని, సమగ్ర విద్యతో సమాజానికి ఉపయోగపడే బాధ్యతగల పౌరులను తయారు చేయడం తమ లక్ష్యమని పేర్కొన్నారు.




## డ్రీమ్ జూనియర్ కళాశాల విద్యార్థుల విజయ పరంపర

ప్రజాపక్షం/కొత్తపల్లి: కరీంనగర్‌లోని డ్రీమ్ డిఫెన్స్ అకాడమీ, జూనియర్ కాలేజీ విద్యార్థులు ఇంటర్మీడియట్ పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలను సాధించి మరోసారి తమ ప్రతిభను చాటుకున్నారు. ఈ సందర్భంగా కాలేజ్ డైరెక్టర్ మాట్లాడుతూ క్రమశిక్షణ, నాణ్యమైన బోధన, నిరంతర పర్యవేక్షణ వల్లే ఈ విజయాలు సాధ్యమయ్యాయని తెలిపారు. ఏఎస్ విన్యా 468 మార్కులు, భీమిని అవినాష్ గౌడ్ 464, రంగు శివ కృతిక్ 463, పాటిల్ మనిదీప్ రెడ్డి 459, తమ్మడవేని అమిత్ కుమార్ 458, రామోజీవార్ రామ్ చరణ్ 456, పరెడ్డి నవదీప్ 454, వెన్నెల హర్ష 453, జూకంటి శ్రీకర్ రెడ్డి 451, కంచర్వార్ గణేష్ రెడ్డి 449, అనుగోత్ హర్ష వర్ధన్ 449, గడిపెల్లి సాయి హర్షిత్ 448, ఎన్నకూన సందీప్ 442 మార్కులతో ప్రతిభ కనబరిచారు. విజయానికి కృషి చేసిన అధ్యాపకులు, తల్లిదండ్రులకు కళాశాల యాజమాన్యం అభినందనలు తెలియజేసింది.

## ఇంటర్ ఫలితాల్లో సాన్వి కళాశాల విజయ దుందుభి

ప్రజాపక్షం/కొత్తపల్లి: ఇంటర్ ఫలితాల్లో కరీంనగర్ రేకుర్తిలోని సాన్వి డిఫెన్స్ అకాడమీ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో జిల్లాలోనే అత్యుత్తమ మార్కులు సాధించి విజయకేతనం ఎగురవేశారు. ఎంపిసి మొదటి సంవత్సరంలో భూంపెల్లి అజయ్ కుమార్ 470 మార్కులకు గాను 466, కాసర్ల శ్రీరామ్ 464, పోలవేణి అభిరామ్ 462, సిఈసిలో పి.అశ్వంత్ 462, కల్లెం ధనుష్ 458 మార్కులు సాధించారు. ద్వితీయ సంవత్సరంలో అజయ్ 988, సిద్దార్థ రాయ్ 978, ఎన్ అజయ్ 976 మార్కులు సాధించారు. రాష్ట్రస్థాయి మార్కులు సాధించిన విద్యార్థులను కళాశాల చైర్మన్ ఎర్రం శెట్టి మునీందర్ అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి ప్రమాద బీమా చెక్కు పంపిణీ

ప్రజాపక్షం/మంథని : మంథని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం లో స్వల్పకాలిక ఋణం తీసుకొని రోడ్డు ప్రమాదం లో మరణించిన మండలంలోని కన్నాల గ్రామానికి చెందిన ఉదుత చంద్రయ్య కుటుంబానికి లక్ష రూపాయల చెక్కు మంజూరు కాగా, సంఘ అఫీషియల్ పర్సన్ ఇంచార్జి కె.అనిల్ కుమార్‌కెడిసిసి బ్యాంకు మేనేజర్ కె.ఉదయశ్రీ, డిఈ సందెబోయిన శ్రీనివాస్ తో కలిసి సోమవారం సాయంత్రం అతని భార్య స్వరూపకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘ కార్యదర్శి మామిడాల అశోక్ కుమార్, ఏఎంసి వైస్ చైర్మన్ ముస్కుల ప్రశాంత్ రెడ్డి, కన్నాల సర్పంచ్ గట్టయ్య, మాజీ సర్పంచ్ పొయిల రాజయ్య, నాయకులు కావటి సమ్మయ్య, సందీప్, బుదారపు సతీష్, నాంపల్లి రంజిత్, సంఘ సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు పత్తి మార్కెట్‌కు సెలవు

ప్రజాపక్షం/జమ్మికుంట: కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలో తెలంగాణ రాష్ట్రంలో అతి పెద్ద రెండవ వ్యవసాయ మార్కెట్‌గా పేరుగాంచిన పత్తి మార్కెట్‌కు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి సందర్భంగా మంగళవారం సెలవు ప్రకటించినట్లు మార్కెట్ కమిటీ చైర్మన్ పుల్లూరి స్వప్న సదానందం తెలిపారు. భారత రాజ్యాంగ నిర్మాత, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని ప్రభుత్వం అధికారిక సెలవు ప్రకటించిన నేపథ్యంలో, మార్కెట్ యార్డు కూడా పూర్తిగా మూసివేయబడుతుందని ఆమె పేర్కొన్నారు. అంబేద్కర్ ఆశయాలు, సామాజిక న్యాయం, సమానత్వం, విద్యా ప్రాముఖ్యత వంటి విలువలు ప్రతి ఒక్కరూ ఆచరించాల్సినవని ఆమె గుర్తుచేశారు. ఈ సందర్భంగా సమస్త రైతు సోదరులు, అడ్తీలు, పత్తి కొనుగోలు వ్యాపారులు, గుమస్తాలు, హమాలీలు, దాడువాయి కార్మికులు, ట్రాక్టర్ ట్రాలీ డ్రైవర్లు గమనించవలసిందిగా రైతులు దూర ప్రాంతాల నుండి మార్కెట్‌కు వస్తుండటంతో, ముందస్తుగా ఈ సమాచారం తెలుసుకుని తమ ప్రయాణాలను సక్రమంగా ప్రణాళిక చేసుకోవాలని సూచించారు. బుధవారం నుండి మార్కెట్ యథావిధిగా సాధారణ లావాదేవీలు, పత్తి కొనుగోలుఅమ్మకాలు, వేలం ప్రక్రియలు యథావిధిగా కొనసాగుతాయని తెలిపారు. కావున రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను పై పేర్కొన్న సెలవు రోజున మార్కెట్ యార్డుకు తరలించవద్దని, అనవసర ఇబ్బందులు ఎదుర్కోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని మార్కెట్ కమిటీ విజ్ఞప్తి చేసింది. మార్కెట్ యార్డు వద్ద రద్దీని నివారించేందుకు, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా సహకరించాలని కోరారు. అదేవిధంగా, మార్కెట్ పునఃప్రారంభమయ్యే 15వ తేదీ నుండి రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు అధికారులు తెలిపారు. తాగునీరు, విశ్రాంతి సదుపాయాలు, తూకం కేంద్రాలు, భద్రతా ఏర్పాట్లు వంటి అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉంచనున్నట్లు పేర్కొన్నారు.



## శివాలయ పునర్నిర్మాణానికి 25వేల రూపాయల విరాళం

ప్రజాపక్షం/ఇల్లందకుంట: శతాబ్దాల చరిత్రకు సాక్ష్యంగా నిలిచిన పురాతన శివాలయానికి కొత్త జీవం పోసే పవిత్ర కార్యక్రమంలో భాగంగా, శివాలయ కమిటీ ఆధ్వర్యంలో పునర్నిర్మాణ నిధుల సేకరణ కొరకు శ్రీ పాడి ఉదయానందన్ రెడ్డి ఇరవై ఐదు వేల రూపాయలు విరాళంగా అందజేసి ఆదర్శంగా నిలిచారు ఈ సందర్భంగా శివాలయ కమిటీ అధ్యక్షులు మాట్లాడుతూ మా మండలంలో యుగాలుగా నిలిచిన ఈ పవిత్ర శివాలయం పునర్నిర్మాణం మా అందరి కల ఉదయానందన్ రెడ్డి ముందుకు వచ్చి విరాళమివ్వడం మాకు అత్యంత స్ఫూర్తిదాయకంగా ఉంది ఇది మిగిలిన దాతలకూ మార్గదర్శకంగా నిలుస్తుంది అని ప్రశంసించారు పాడి ఉదయానందన్ రెడ్డి మాట్లాడుతూ, ఇది కేవలం డబ్బు కాదు ఇది మన సంస్కృతిని, సంప్రదాయాన్ని కాపాడాలనే నా మనసులోని భక్తి భావం ఈ ఆలయంతో మా తరాలకు అనుబంధం ఉంది. అందుకే ఈ పవిత్ర కార్యంలో నా వంతు సహాయం చేయడం నా అదృష్టంగా భావిస్తున్నాను అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శివాలయం ఆలయ పునర్నిర్మాణ కమిటీ, గ్రామ సర్పంచ్ దార సురేష్ గ్రామస్తులు పాల్గొన్నారు.



## కరీంనగర్ డంపింగ్ తనిఖీ చేసిన నగర మేయర్

ప్రజాపక్షం/కరీంనగర్ : నగర ప్రజలను దశాబ్దాలుగా వేధిస్తున్న డంపింగ్ యార్డ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా మా పాలకవర్గం పని చేస్తుందని మేయర్ కొలగాని శ్రీనివాస్ అన్నారు. కరీంనగర్ లో బుధవారం రోజు బైపాస్ లో గల నగరపాలక సంస్థ డంపింగ్ యార్డును అధికారులతో కలిసి మేయర్ కొలగాని శ్రీనివాస్ సందర్శించారు. కొద్ది రోజులుగా డంపింగ్ యార్డ్ అంటుకొని మంటలు చెలరేగి పొగ, దుర్వాసనతో స్థానిక ప్రజలు ఇబ్బందులకు గురౌతున్న నేపథ్యంలో డంపింగ్ యార్డును తనిఖీ చేసి, పరిశీలించారు. వ్యాపించెందే మంటలు, పొగను వాటర్ ట్యాంకర్ల ద్వారా 3 రోజుల్లో అదుపు చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం డంపు యార్డు లో కొనసాగుతున్న బయోమైనింగ్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బయోమైనింగ్ వేగవంతం పై ఏజెన్సీ, అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. డంపింగ్ యార్డుకు ప్రతిరోజూ సుమారు 150 నుండి 180 మెట్రిక్ టన్నుల చెత్త చేరుతుండటంతో, పేరుకుపోయిన పాత వ్యర్థాలను త్వరగా తొలగించాలని ఆదేశించారు. బయోమైనింగ్ పనుల్లో జాప్యంపై అసహనం వ్యక్తం చేస్తూ, నిర్దేశించిన గడువు లోగా చెత్తను వేరుచేసే ప్రక్రియను వేగవంతం చేయాలని కాంట్రాక్ట్ ఏజెన్సీని హెచ్చరించారు.

డంపింగ్ యార్డును పూర్తిగా క్లియర్ చేసి, ఆ స్థలాన్ని ప్రజలకు ఉపయోగపడేలా సుందరీకరించడమే లక్ష్యమని మేయర్ కొలగాని శ్రీనివాస్ పేర్కొన్నారు. కేంద్ర నిధులతో చేపట్టిన ఈ పనులు పూర్తయితే మానేరు నది పరివాహక ప్రాంతంలో కాలుష్యం తగ్గి, నగరవాసులకు ఊరట లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు మాసం గణేష్, చంద్ర, వసంత లక్ష్మీ భూమయ్య, నగరపాలక సంస్థ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## సహస్ర విద్యార్థుల ప్రభంజనం

ప్రజాపక్షం/ కరీంనగర్‌టౌన్: ఇంటర్మీడియట్ ఫలితాల్లో కరీంనగర్‌లోని సహస్ర జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి ప్రభంజనం సృష్టించారు. పలువురు విద్యార్థులు టాప్ స్కోర్లతో మెరిశారు. ఈ సందర్భంగా కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కరెస్పాండెంట్ ఎస్.వెంకట్ మాట్లాడుతూ విద్యార్థుల ఉన్నత భవిష్యత్తుకు ఇంటర్మీడియట్ పునాది వంటిదని పేర్కొన్నారు. నాణ్యమైన విద్యతో పాటు క్రమశిక్షణ, విలువలతో కూడిన బోధ అందించడం వల్లే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని తెలిపారు. ప్రతిభ చాటిన విద్యార్థులను కళాశాల యాజమాన్యం అభినందించింది. ప్రథమ సంవత్సరం ఎంపిసిలో 470 మార్కులకు గాను ఆర్.రక్షిత (467), బి.లక్ష్మి పూర్ణ (467), ఎస్.మనస్విని (466) అత్యుత్తమ మార్కులు సాధించారు. ప్రథమ సంవత్సరం బైపీసీలో 440 మార్కులకు గాను బి.యశస్విరావు (435), కె.శృతీశ్వరి (433), కె, రష్మి (432) మార్కులు పొందారు. ద్వితీయ ఎంపిసిలో పి.ప్రావణి (987), ఎస్.స్పందన (986), జే.గీతిక (983), శృతి (980)లు సాధించారు. ద్వితీయ బైపీసీలో టి.శ్రుతి (987), బి. తేజస్విని (987) అత్యధిక మార్కులు సాధించారు. కామర్స్ విభాగంలో ప్రథమ సంవత్సరంలో ఎం.తరుణ్ చందు 939, ఎం.వైష్ణవి 936 మార్కులతో ప్రతిభ చాటారు. కార్యక్రమంలో డైరెక్టర్లు ఎస్. రమేష్, బి. ప్రభాకర్ రెడ్డి, ప్రిన్సిపాల్ ఆర్పీ రెడ్డిలు పాల్గొన్నారు.

## ఇంటర్ ఫలితాల్లో మెరిసిన తేజస్

ప్రజాపక్షం/కొత్తపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం ప్రకటించిన ఇంటర్మీడియట్ ఫలితాల్లో తేజస్ జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించినట్లు చైర్మన్ సిహెచ్ సతీష్ రావు తెలిపారు. తేజస్ జూనియర్ కళాశాల కొత్తపల్లిలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపిసిలో ఎ.కార్తీక్, బి.నివేదనలు 467 మార్కులు, పి.సాయి చరణ్, బి.నితిన్ 466 మార్కులు, బి.సాయితేజ, కె.నంద కిషోర్ 465 మార్కులు, సిఈసిలో మొదటి సంవత్సరంలో వి.శ్రీచేతన్ 483, సిహెచ్ వరుణ్ తేజ 475, బైపిసి మొదటి సంవత్సరం పి ఆదిత్యా నాయక్ 426, ఎంపిసి ద్వితీయ సంవత్సరం ఎ.శ్రీవర్ధన్ 993, బి.రిషిత్ యాదవ్ 992, ఎ.నందీశ్వర్ రెడ్డి 992, ఎం. వర్షిత్ 992, సిఈసి ద్వితీయ సంవత్సరంలో బి.రామ్‌చరణ్ 972, వై నవదీప్ 969, జి.రాజేందర్, బైపిసి ద్వితీయ సంవత్సరం ఆర్. జగన్ 954 మార్కులు సాధించినట్లు చెప్పారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు పుష్పగుచ్ఛం అందించి అభినందించారు. ఇంటర్మీడియట్‌తో పాటు డిఫెన్స్ రంగంలో ఉద్యోగాలు సాధించే విధంగా కృషి చేస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడంలో అంకిత భావంతో పనిచేసిన తమ ఉపాధ్యాయ బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది తదితరులున్నారు.

## ఇంటర్ ఫలితాల్లో మెరిసిన డ్రీమ్ డిఫెన్స్

ప్రజాపక్షం/కొత్తపల్లి: ఇంటర్మీడియట్ ఫలితాల్లో డ్రీమ్ డిఫెన్స్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించినట్లు చైర్మన్ ఎన్.వెంకటరెడ్డి తెలిపారు. భీమని అవినాష్ రెడ్డి, కాసర్ల విష్ణు కుమార్, రంగు శివ కార్తీక్, రాంచరణ్, జూకంటి శ్రీకర్ రెడ్డి, తమ్మదవేని అమిత్ కుమార్ పాటిల్, మణిదీప్‌రెడ్డి, పారెడ్డి నవదీప్‌లు రాష్ట్ర స్థాయిలో ఫలితాలు సాధించినట్లు చెప్పారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు పుష్పగుచ్ఛం అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది తదితరులు ఉన్నారు.

## ఢిల్లీ జూనియర్ కళాశాల ప్రతిభ

ప్రజాపక్షం/కొత్తపల్లి: ఇంటర్ ఫలితాల్లో ఢిల్లీ జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. ఎంపిసి మొదటి సంవత్సరంలో ఎం అబిత 468, ఎంపిసి ద్వితీయ సంవత్సరంలో వి.నర్మత 992 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో నిలిచారని ఢిల్లీ జూనియర్ కళాశాల , ఢిల్లీ డిఫెన్స్ అకాడమీ అధినేత కొత్త సతీష్ రెడ్డి తెలిపారు. అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఢిల్లీ విద్యాసంస్థల అధినేత కొత్త సతీష్ రెడ్డి అభినందించారు. సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్,విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ప్రజావాణిలో నాలుగు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాపక్షం/జమ్మికుంట : తహసిల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో నాలుగు దరఖాస్తులు స్వీకరించినట్లు తాసిల్దార్ వెంకటరెడ్డి తెలిపారు ఈ దరఖాస్తులు భూ సమస్యల పరిష్కారం కోసం వచ్చినట్లు ఆయన తెలిపారు ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదును పరిష్కారించేందుకు తగు చర్యలు చేపట్టనున్నట్లు తహసిల్దార్ తెలిపారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలు పరిశీలించిన అధికారులు

ప్రజాపక్షం/నిజాంసాగర్: కామారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్, జిల్లా సివిల్ సప్లయి అధికారి, నాయబ్ డిప్యూటీ తహసీల్దార్‌లు సోమవారం నాడు నిజాంసాగర్ మండలంలో పర్యటించారు. ఈ మేరకు వారు నిజాంసాగర్ మండలంలోని గోర్గల్ గ్రామంలో వరి ధాన్యం కొనుగోలుకేంద్రాలను పరిశీలించారు. వారు మాట్లాడుతూ రైతులకు కొనుగోలుకేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. ముఖ్యంగా లారీల కొరత లేకుండా చర్యలు చేపట్టినట్లు వారు పేర్కొన్నారు.

## మైనర్లు వాహనాలు డ్రైవ్ చేయరాదు

ప్రజాపక్షం/పిట్లం: మైనర్లు వాహనాలను నడుపరాదని పిట్లం ఎస్సై ఆంజనేయులు సూచించారు. 10వ తరగతి విద్యార్థులకు పరీక్షలు ముగిసిన నేపథ్యంలో ఆయా గ్రామాల నుండి పిట్లంలో పరీక్ష రాసేందుకు వచ్చిన విద్యార్థిని విద్యార్థులకు వారి భవిష్యత్తును గురించి పలు అంశాలను సూచించారు. రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలని, వేసవికాలంలో ఈత కొరకు జలాశయాలు, చెరువులు, కుంటల లో దిగరాదన్నారు. అపరిచితులు చేసే ఫోన్ కాల్స్‌ని నమ్మి మోసపోరాదని, ఈ విషయాన్ని త మ తల్లితండ్రులకు సైతం తెలియపర్చాలని ఎస్సై విద్యార్థులకు సూచించారు. ఎంతో బంగారు భవిష్యత్తు కలిగిన మీరు ఒక ప్రణాళిక ప్రకారం చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ప్రధాన మంత్రి ఇంటర్న్ షిప్‌కు దరఖాస్తు చేసుకోవాలి

ప్రజాపక్షం/నిర్మల్ టౌన్:కేంద్ర ప్రభుత్వం అమలు పరుస్తున్న ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ పథకం మూడో దశలో జిల్లాలోని అర్హులైన యువతీ యువకులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఒక ప్రకటనలో తెలిపారు.యువతకు తమ నైపుణ్యాలు పెంపుదల చేసుకునేందుకు ఇది ఒక గొప్ప అవకాశం అని పేర్కొన్నారు.ఈ ఇంటర్న్‌షిప్ 6 నుండి 12 నెలల వరకు ఉంటుందని అన్నారు.ఇందులో ఎంపికైన అభ్యర్థులకు నెలకు 5వేల రూపాయల చొప్పున ఆర్థిక సహాయం(స్టైఫండ్),ఒకసారి అదనంగా ఇచ్చే ప్రోత్సాహకం (గ్రాంట్) 6 వేల రూపాయలు అందుతాయని వివరించారు.దీంతోపాటు అభ్యర్థులకు పీఎం వంటి పథకాల కింద ఉచిత బీమా సౌకర్యం కల్పించబడుతుందని వివరించారు.18 నుండి 25 సంవత్సరాల మధ్య వయస్సు గల విద్యార్హత 10వ తరగతి,ఇంటర్మీడియట్,ఐటిఐ,పాలిటెక్నిక్ డిప్లొమా,డిగ్రీ బి.టెక్,పిజి చదివిన,చివరి సంవత్సరం చదువుతున్న వారు అర్హులని అన్నారు.కుటుంబ వార్షిక ఆదాయం 12 లక్షలకు మించరాదని చెప్పారు.అర్హులైన అభ్యర్థులు తమ మొబైల్ నంబర్,ఆధార్,ఇతర విద్యార్హత పత్రాలు,ఫోటోలతో పోర్టల్ ద్వారా ఆన్ లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చునని వివరించారు.అభ్యర్థులు గరిష్ఠంగా మూడు ఇంటర్న్‌షిప్ అప్షన్లను ఎంచుకునే అవకాశం ఉందని తెలిపారు.మరింత సమాచారం కోసం కలెక్టరేటులోని జిల్లా పరిశ్రమల కార్యాలయం,లేదా టోల్‌ఫ్రీ నంబర్ 1800116090 ని సంప్రదించాలని కలెక్టర్ సూచించారు.జిల్లాలోని యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని కలెక్టర్ ఆ ప్రకటన ద్వారా తెలిపారు.

## నిర్మల్ అల్ఫోర్స్ జూనియర్ కళాశాల ఘనవిజయం

ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ : తెలంగాణ ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షా ఫలితాల్లో (టిజి ఐపిఈ 2026) నిర్మల్ పట్టణంలోని అల్ఫోర్స్ గర్ల్స్ జూనియర్ కళాశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ మార్కులు సాధించారు.సోమవారం విడుదలైన ఫలితాల్లో ప్రథమ,ద్వితీయ సంవత్సరాల్లోని అన్ని విభాగాల్లో నూ ఈ కళాశాల విద్యార్థులు అగ్రగామిగా నిలిచి నిర్మల్ జిల్లా పేరును రాష్ట్ర స్థాయిలో మారుమోగించారు.



**ప్రథమ సంవత్సర ఫలితాలు..**

ఎం.పి.సి విభాగంలో జి.అక్షర,డి.వినీషా 470 మార్కులకు గాను 469 మార్కులు సాధించి స్టేట్ ఫస్ట్ నిలిచారు.అలాగే ఎం.చైతన్య,అఫ్సాన్ మహీన్ 468, ఎస్.నందిని,ఏ కృష్ణశ్రీ 467, ఎన్.ఆశ్రీత 466 మార్కులతో సత్తా చాటారు.బై.పి.సి విభాగంలోనూ 440 మార్కులకు గాను ఖాన్సాఅలియా, ఎస్.జాగృతి,ఏ.హర్షిత 439 మార్కులతో స్టేట్ ఫస్ట్ సాధించగా,మీరాబ్ ఇస్తెక్వార్,హజేరా కునైన్ 438,మదీహా నాజ్,ఆయేషా సిద్ధిఖ,మరియం తమన్నా 437,ఆశ్రీయా సుజాయిన్,లియా మారియ లిజో ,ఎన్.శ్రీనిజ 436 మార్కులతో అత్యుత్తమ ఫలితాలు సమోదు చేశారు.

**ద్వితీయ సంవత్సర ఫలితాలు..**

రెండవ సంవత్సరం బైపిసి విభాగంలో నబేలా తహ్రీమ్,కె.హారిక 1000 మార్కులకు గాను 995 మార్కులు సాధించి రికార్డు సృష్టించారు.ఎస్.సారిక పాటిల్,సామా ఫిర్దోస్ 993 మార్కులు సాధించగా,మరో తొమ్మిది మంది విద్యార్థులు 990 కి పైగా మార్కులు సాధించారు.ఎం.పి.సి విభాగంలో ఎస్.శివాని,కె.త్రిపుర 994 మార్కులు,ఎన్.కృష్ణవేణి,జె.ప్రసూన శ్రీ,వై.సాయి ఐశ్వర్య 993 మార్కులు,వి.కార్తీక 991 మార్కులతో తమ ప్రతిభను చాటుకున్నారు.

**హర్షం వ్యక్తం చేసిన యాజమాన్యం..**

ఈ అద్భుత విజయాలపై అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి.నరేందర్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు.విద్యార్థుల కఠోర శ్రమ,అధ్యాపకుల అంకితభావం వల్లే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని ఆయన పేర్కొన్నారు.విజయం సాధించిన విద్యార్థులను,వారి తల్లిదండ్రులను కళాశాల యాజమాన్యం ప్రత్యేకంగా అభినందించింది.

## బాధితుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రీవెన్స్ డే

**ప్రజా సమస్యలకు పారదర్శకంగా తక్షణ పరిష్కారం..**

ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ : సోమవారం జిల్లా పోలీసు ముఖ్య కార్యాలయం నందు నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమానికి నిర్మల్ డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఆర్జీదారుల నుండి ఫిర్యాదులు స్వీకరించి వెంటనే ఫిర్యాదు దారుల ముందే సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ల ద్వారా బాధితులకు చట్టపరంగా అందాల్సిన సహాయాన్ని అందిస్తూ వారి సమస్యలను పరిష్కరించాలని జిల్లా ఎస్పీ ఆదేశించారు.



**ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ..**

ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయడం జరుగుతుందని ,పోలీస్ అధికారులు,సిబ్బంది పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి,వినతులు,ఫిర్యాదులు స్వీకరించి,అవసరమైతే క్షేత్ర స్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు.తద్వారా ఫిర్యాదుదారునికి పోలీస్ శాఖపై భరోసా,నమ్మకం కలుగుతుందన్నారు. గ్రీవెన్స్ డేలో వచ్చిన ఫిర్యాదులు ఆన్ లైన్ లో పొందుపరుస్తూ ఏ మేరకు పరిష్కారం అయ్యాయో అ ని ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలందించడం జరుగుతుందని అన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా వారి సమస్యలను మా దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని ఎస్పీ తెలిపారు.గ్రీవెన్స్ డే లో వచ్చిన ప్రతి ఫిర్యాదు పైన సంబంధిత పోలీసు స్టేషన్ అధికారులకు వెంటనే ఆదేశాలు జారీ చేసి,ఫాలో అప్ చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.సమస్యల పరిష్కారంలో ఆలస్యం జరగకుండా పర్యవేక్షణ చేస్తామని హామీ ఇచ్చారు.బాధితులకు సత్వర న్యాయం జరిగేలా పారదర్శక విధానంలో చర్యలు తీసుకోవడమే మా ప్రధాన లక్ష్యం అని జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల పేర్కొన్నారు.

## మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను వెంటనే ఏర్పాటు చేయాలి

ప్రజాపక్షం/దిలావర్‌పూర్:నిర్మల్ జిల్లాలోని మొక్కజొన్న రైతులకు మద్దతుగా నిలిచేందుకు ప్రభుత్వం వెంటనే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని బిఆర్‌ఎస్ నాయకులు డిమాండ్ చేశారు.సోమవారం దిలావర్‌పూర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ,సాగు చేసిన పంట చేతికి వచ్చే తరుణంలో రైతులు ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు.



**రైతుల ప్రయోజనాలే ముఖ్యం..**

ఈ సందర్భంగా దిలావర్‌పూర్ బిఆర్‌ఎస్ మండల కన్వీనర్ ఏలాల చిన్నారెడ్డి,గ్రీన్ ఇండియా ఛాలెంజ్ జిల్లా అధ్యక్షుడు రాథోడ్ అశోక్ మాట్లాడుతూ..ప్రస్తుతం మార్కెట్‌లో వ్యాపారులు సిండికేట్‌గా మారి తక్కువ ధరకు కొనుగోలు చేస్తూ రైతును నట్టేట ముంచుతున్నారని ఆరోపించారు.ప్రభుత్వమే నేరుగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తే రైతులకు కనీస మద్దతు ధర లభిస్తుందని వారు స్పష్టం చేశారు.

**గ్రామాల్లో పర్యవేక్షణ..**

నర్సాపూర్ బిఆర్‌ఎస్ మండల కన్వీనర్ తోడిశెట్టి సుధన్ మాట్లాడుతూ,ప్రతి గ్రామంలో మొక్కజొన్న సాగు వివరాలను సేకరించిన ఏ ఒక్క రైతు నష్టపోకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సురేష్,మాజీ సర్పంచ్ విట్టల్ పాల్గొని మాట్లాడుతూ..గతంలో మాదిరిగా ప్రతి మండలంలోనూ తగినన్ని కేంద్రాలను ఏర్పాటు చేసి,రైతులకు రవాణా ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు.మొక్కజొన్న పండించిన రైతులకు త్వరితగతిన న్యాయం చేయని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని నేతలు హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో నాయకులు జాన్ సత్యం,అన్వర్ ఖాన్,రాజేష్ నాయక్,షేక్ హారున్,మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## అర్జీలను గడువులోగా పరిష్కరించాలి

ప్రజాపక్షం/మావల:ప్రజావాణిలో వచ్చిన అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ రాజేశ్వర్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ఆయన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ వారం ఇందిరమ్మ ఇళ్లు, పింఛన్లు, భూ సమస్యలపై మొత్తం 85 వినతులు అందాయని తెలిపారు. వీటిని వెంటనే సంబంధిత శాఖలకు పంపి, త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ స్రవంతి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మనోహర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఎడపల్లి మండలంలో ఆరైవ్ అలైవ్

### రోడ్డు భద్రతపై గ్రామ సభలు

ప్రజాపక్షం/ఎడపల్లి:రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఎడపల్లి మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం గ్రామ సభలు నిర్వహించారు. ముఖ్యంగా ఆరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా రోడ్డు భద్రతా నియమాలపై ప్రజలకు, యువతకు విస్తృత అవగాహన కల్పించారు. ఈ నెల 13 నుంచి 18 వరకు నిర్వహించనున్న రోడ్డు భద్రతా వారోత్సవాలను విజయవంతం చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ శివధర్ రెడ్డి ఇచ్చిన ఆదేశాల మేరకు ఈ సభలు జరిగాయి. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు మాట్లాడుతూ.. ప్రపంచంలోనే భారత్‌లో అత్యధిక రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, మరణిస్తున్న వారిలో ఎక్కువ మంది ద్విచక్రవాహనదారులు, పాదచారులే ఉంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారు డ్రైవర్లు సీట్ బెల్ట్ పెట్టుకోవాలని సూచించారు. మండలంలో తరచూ ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి అక్కడ హెచ్చరిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి మండలంలో ప్రమాద రహిత వాతావరణాన్ని కల్పించాలని పిలుపునిచ్చారు. ఈ సభల్లో గ్రామాల సర్పంచులు, ఎస్సై రమ, సెక్రెటరీలు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఐకెపి మెక్మా ఆర్పీ తొలగింపుపై - కలెక్టర్‌కు ఫిర్యాదు..



ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :నిర్మల్ జిల్లా కేంద్రంలోని బంగాల్‌పేట్ బోయ వాడ్లలో ఐకెపి (మెక్మా) రిసోర్స్ పర్సన్ (ఆర్పీ)గా పనిచేస్తున్న కె.సంధ్యారాణిని అక్రమంగా విధుల నుండి తొలగించడాన్ని సీఐటీయూ తీవ్రంగా ఖండించింది.రాజకీయ కుట్రలతో,నిబంధనలకు విరుద్ధంగా జరిగిన ఈ తొలగింపును రద్దు చేసి,ఆమెను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బొమ్మెన సురేష్ డిమాండ్ చేశారు.

**కుట్రపూరితంగా జనరల్ బాడీ సమావేశం**

ఈ సందర్భంగా బొమ్మెన సురేష్ మాట్లాడుతూ,గత పదేళ్లుగా ఆర్పీగా సేవలందిస్తున్న సంధ్యారాణిని తొలగించడానికి కొందరు వ్యక్తులు కుట్ర పన్నారని ఆరోపించారు.సంఘ సభ్యులు హాజరుకాకుండానే సంబంధం లేని వ్యక్తులతో తప్పుడు తీర్మానాలు చేయించి ఈ ప్రక్రియ పూర్తి చేశారని విమర్శించారు.కొత్త ఆర్పీల నియామకంలో భారీగా నగదు చేతులు మారాయనే అనుమానాలు ఉన్నాయని,దీనిపై జిల్లా కలెక్టర్ పూర్తిస్థాయి విచారణ జరిపించాలని ఆయన కోరారు.

**రాజకీయ వేధింపులే కారణం..**

సీఐటీయూ అధ్యక్షురాలు సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు పి.గంగామణి మాట్లాడుతూ,ఈ వ్యవహారంలో మున్సిపల్ వైస్ చైర్మన్,స్థానిక కౌన్సిలర్లు,మెక్మా టీఎంసీ దత్తాద్రి,కంప్యూటర్ ఆపరేటర్ రాకేష్ పాత్ర కీలకమని ఆరోపించారు.మున్సిపల్ ఎన్నికల్లో తమకు సహకరించలేదనే కక్షతోనే సంధ్యారాణిని వేధిస్తున్నారని మండిపడ్డారు.లోన్ల దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ కోసం లంచాలు ఇవ్వలేదనే కారణంతోనే పక్కా ప్రణాళికతో ఆమెను తొలగించారని అన్నారు.ఇందుకు సంబంధించి తమ వద్ద ఫోన్ రికార్డింగ్‌లు,ఫోన్ పే ద్వారా జరిగిన నగదు బదిలీల ఆధారాలు ఉన్నాయని ఆమె స్పష్టం చేశారు.

**నాకు న్యాయం చేయండి..**

బాధితురాలు కె.సంధ్యారాణి మాట్లాడుతూ,తనకు కనీస సమాచారం ఇవ్వకుండానే తప్పుడు కారణాలతో టీఎంసీ దత్తు తనను విధుల్లో నుంచి తొలగించారని ఆవేదన వ్యక్తం చేశారు.అధికారుల తీరు వల్ల తాను ఉపాధి కోల్పోయానని కలెక్టర్ స్పందించి తనకు న్యాయం చేయాలని వేడుకున్నారు.ఈ నిరసన కార్యక్రమంలో సంఘం సభ్యులు అరుణ,లక్ష్మి ,జ్యోతి, మమత, లత, శ్రీవేద, పూజ, వనిత తదితరులు పాల్గొని సంధ్యారాణికి మద్దతు తెలిపారు.

## అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డులు

**ప్రజాపక్షం/తిర్యాని :** కొమురం భీం జిల్లా తిర్యాని మండలంలోని నాయకపుగూడ గ్రామ పంచాయతీలో ప్రభుత్వం ఆధ్వర్యంలో కొత్త రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని అర్హులైన పేద కుటుంబాలకు రేషన్ కార్డులు అందజేయడం ద్వారా వారి ఆహార భద్రతకు మరింత బలాన్ని చేకూర్చినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా మేండ్రపు మొగిలి, మేండ్రపు చిన్నయ్య కుటుంబాలకు రేషన్ కార్డులను సర్పంచ్ చేతుల మీదుగా అందజేశారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలలో భాగంగా అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డులు అందేలా చర్యలు తీసుకుంటున్నామని సర్పంచ్ ఎడులు సుమలత శ్రీనివాస్ తెలిపారు. పేద ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని భవిష్యత్తులో కూడా ఇలాంటి కార్యక్రమాలు కొనసాగుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ పవన్ కుమార్, గ్రామ సెక్రటరీ శ్రీలత, గ్రామస్థులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ చరిత్రను విద్యార్థులు తెలుసుకోవాలి

**ప్రజాపక్షం/జన్నారం :** జన్నారం మండలం కలమడుగు వివేకానంద పాఠశాలలో విద్యార్థులకు తెలంగాణ అంబేద్కర్ పూలే మహాజన సంఘం ఆధ్వర్యంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చరిత్ర పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం నిర్మల్ జిల్లా అధ్యక్షుడు మునేసుల శైలేందర్ మాట్లాడుతూ నేటి విద్యార్థులకు, యువతకు అంబేద్కర్ చరిత్రపై అవగాహన కల్పించడానికి, ఆయన సేవలను తెలియజేయడానికి ఈ పుస్తకాలను అందిస్తున్నామని పేర్కొన్నారు. ఒక మహోన్నత వ్యక్తిపై విద్యార్థి దశ నుండే పూర్తి అవగాహన ఉండాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. అంబేద్కర్ ఆశయాలను స్మరించుకుంటూ విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. అంబేద్కర్ సంఘం జిల్లా నాయకుడు రమేష్, పాఠశాల కరస్పాండెంట్ సతీష్ గౌడ్, ఇన్చార్జీలు తిరుపతి, మహేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రోడ్డు నిబంధనలు పాటించి ప్రమాదాలు నివారించాలి

**ప్రజాపక్షం/జన్నారం :** జన్నారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద రోడ్డు భద్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని సోమవారం జన్నారం ఎస్ఐ జి. ఉదయ్ కిరణ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలను తగ్గించడంలో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని, వాహనదారులు, విద్యార్థులకు రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పిగి ఉండాలన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారులో ప్రయాణించే వారు సీటు బెల్టు పెట్టుకోవాలని, మద్యం సేవించి వాహనాలు నడపకూడదని, అతివేగం ప్రమాదాలకు ప్రధాన కారణమని పేర్కొన్నారు. ముఖ్యంగా యువత నిబంధనలు పాటించడం ద్వారా ప్రాణాపాయం నుంచి తప్పుకోవచ్చని, వాహనదారులు తమ వాహనాలకు సంబంధించిన రిజిస్ట్రేషన్ పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్ విధిగా కలిగి ఉండాలని, తనిఖీల సమయంలో పత్రాలు లేనిపక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం రోడ్డు భద్రతపై అవగాహన పాంప్లెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, స్థానిక నాయకులు, యువత, విద్యార్థులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

### అదనపు కలెక్టర్ ఎం. డేవిడ్



**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :** ప్రజావాణిలో వచ్చిన ప్రతి దరఖాస్తును క్షేత్ర స్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్ ఆదేశించారు. సోమవారం సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన పాల్గొని అర్జీదారుల నుండి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ముఖ్యంగా ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, భూ ఆక్రమణలు, రోడ్ల నిర్మాణం మరియు వ్యవసాయ భూముల్లో బోరుబావుల మంజూరుపై పలువురు దరఖాస్తు చేసుకున్నారు. ఆసిఫాబాద్ మున్సిపాలిటీలోని నూర్ నగర్ కు చెందిన సాజిదాబేగం, వాంకిడికి చెందిన సంధ్యారాణి, ఈప్పల నవేగాంకు చెందిన గండేవాడ్ మహమ్మద్ తమకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. సాలేగూడకు చెందిన ముంజం బాగుబాయి తన భూమిని ఇతరులు కబ్జా చేశారని ఫిర్యాదు చేయగా, అంకుసాపూర్ కు చెందిన దుర్గం హక్కు బోరుబావి మంజూరు చేయాలని దరఖాస్తు చేశారు. అలాగే కెరమెరి మండలం మహారాజ్ గూడాకు చెందిన రాథోడ్ విజయ్ తన గ్రామంలో బాగున్న సిసి రోడ్డుపైనే మళ్లీ రోడ్డు వేస్తున్నారని ఫిర్యాదు చేశారు. ముఖద్దం గూడాకు చెందిన రాథోడ్ మనిషా గత సర్పంచ్ ఎన్నికల పోటీ పత్రాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, అర్జీదారులు పాల్గొన్నారు.

## పాఠశాల గ్రౌండ్‌లో టవర్ నిర్మాణం ఆపాలి



**ప్రజాపక్షం/మందమర్రి :** మందమర్రి పట్టణంలోని సింగరేణి హైస్కూల్ గ్రౌండ్‌లో ఎయిర్ టెల్ టవర్ నిర్మాణం చేపట్టడంపై వాకర్స్ అసోసియేషన్ సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థుల ఆరోగ్యం, ప్రజల భద్రతను పణంగా పెట్టే ఈ నిర్మాణాన్ని తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. టవర్ నుంచి వెలువడే రేడియేషన్ వల్ల పక్కనే ఉన్న పాఠశాల విద్యార్థులు అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉందని వారు హెచ్చరించారు. చిన్నారుల భవిష్యత్తును ప్రమాదంలోకి నెట్టే ఈ చర్యను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని వాకర్స్ అసోసియేషన్ నాయకులు దుర్గం ప్రభాకర్, రాజేశం స్పష్టం చేశారు. ప్రతిరోజూ గ్రౌండ్‌లో వ్యాయామం చేసే వాకర్స్, క్రీడలు ఆడే యువతకు కూడా దీనివల్ల తీవ్ర ఇబ్బందులు తలెత్తుతాయని పేర్కొన్నారు. ప్రజా ఆరోగ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని గుర్తు చేస్తూ అధికారుల నిర్లక్ష్యాన్ని ఖండించారు. ప్రజల ప్రాణాల కంటే టవర్ నిర్మాణం ముఖ్యం కాదని, వెంటనే పనులు నిలిపివేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

## రూ.5లకే శుద్ధి చేసిన తాగునీరు



**ప్రజాపక్షం / తిర్యాని :** ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని తిర్యాని గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంటును సోమవారం స్థానిక సర్పంచ్ మడావి రాజేష్ ప్రారంభించారు. కలుషిత నీటి కారణంగా ఏర్పడే అనారోగ్య సమస్యలను నివారించేందుకు పంచాయతీ ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆయన తెలిపారు. ముఖ్యంగా వేసవి కాలంలో తాగునీటి కొరత లేకుండా సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండేలా కేవలం 5 రూపాయలకే సురక్షితమైన తాగునీరు అందిస్తున్నామని వెల్లడించారు. ఈ ప్లాంట్ ద్వారా పేద మధ్యతరగతి కుటుంబాలకు ఎంతో ఉపశమనం కలుగుతుందని గ్రామస్తులందరూ ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని కోరారు. మండలంలో ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు పాటించాలని, అత్యవసర పరిస్థితుల్లో తప్ప బయటకు రావద్దని ముఖ్యంగా వృద్ధులు చిన్నపిల్లల విషయంలో కుటుంబ సభ్యులు అప్రమత్తంగా ఉండాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ అధ్యక్షులు పున్నం హరీష్ కుమార్, వార్డు సభ్యులు కూన సాయి, ముత్యాల దర్శన్, ఎడ్ల భాగ్య, కార్ బార్ తిరుపతి, వెన్న సంతోష్ పాల్గొన్నారు.

## మేదరి వృత్తిదారుల సమస్యలు పరిష్కరించాలి



**ప్రజాపక్షం / జన్నారం :** మేదరి వృత్తిదారుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఫారెస్ట్ అధికారుల వేధింపులు ఆపాలని తెలంగాణ రాష్ట్ర చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ రాష్ట్ర నాయకులు పైళ్ళ ఆశయ్య డిమాండ్ చేశారు. సోమవారం జన్నారం మండల కేంద్రంలో నిర్వహించిన మేదరి వృత్తిదారుల జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. తట్టలు, బుట్టలు తయారు చేసి విక్రయించడం ద్వారా వచ్చే ఆదాయంతోనే అనేక కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయని వారిని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. అడవుల నుండి వెదురు తెచ్చుకోవడంపై ఫారెస్ట్ అధికారులు ఆంక్షలు విధిస్తూ అక్రమ కేసులు పెడతామని బెదిరించడం సరికాదని విమర్శించారు. ప్రభుత్వం వెదురుపై మేదరులకు హక్కులు కల్పిస్తూ జీఓలు జారీ చేసినా అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని మండిపడ్డారు. బిసి కామారెడ్డి డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని వెదురు పెంచుకోవడానికి 100 ఎకరాల భూమి కేటాయించాలని డిమాండ్ చేశారు. 50 ఏళ్లు పైబడిన వృత్తిదారులకు పెన్షన్, గుర్తింపు కార్డులు ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కనికరపు అశోక్ కోరారు. అనంతరం మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పిల్లి నరసయ్య, ప్రధాన కార్యదర్శిగా పోతు సురేష్, కోశాధికారిగా పర్ల శంకర్, ఉపాధ్యక్షులుగా కనికరపు అశోక్, పర్ల కనకయ్య, నగురు కిషన్, ప్రచార కార్యదర్శిగా శనిగారపు వెంకటేష్, కార్యదర్శి పొడిపెల్లి, సంయుక్త కార్యదర్శులుగా కోడిజుట్టు మధు, మామిడిపల్లి శ్రీకాంత్ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో మేదరి వృత్తిదారులు పాల్గొన్నారు.

## వాహనదారుల అవగాహన పోస్టర్లను ఆవిష్కరించిన ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/మంచిర్యాల టౌన్ :** మంచిర్యాల జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 13 నుండి 18వ తేదీ వరకు నిర్వహించి వాహనదారుల అవగాహన కార్యక్రమ పోస్టర్లను సోమవారం మంచిర్యాల శాసనసభ్యుడు కొక్కిరాల ప్రేంసాగర్‌రావు ఆవిష్కరించారు. ప్రజాపాలన, ప్రగతి ప్రణాళిక 99 రోజుల ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఈ నెల 13 నుండి మంచిర్యాల జిల్లా ఆర్‌టివి ఆధ్వర్యంలో అవేర్‌నెస్ కల్పించే విధంగా కార్యక్రమాలు నిర్వహించనున్నారని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణతో పాటు వాహనదారులు పాటించాల్సిన నిబంధనల గురించి అవగాహన కల్పించడం తదితర రక్షణ చర్యలపై అందరికి తెలిసేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా ఆర్‌టివి సభ్యులు అంకతి శ్రీనివాస్‌రావు, ఎంవిఐలు రంజిత్‌రెడ్డి, కిశోర్ చంద్రరెడ్డి, ఆర్‌టిఏ అధికారులు పాల్గొన్నారు.

## పదవ తరగతి విద్యార్థులకు అరటిపండ్లు, మజ్జిగ పంపిణీ



**ప్రజాపక్షం/పెంచికల్ పేట్ :** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు పోతపల్లి సర్పంచ్ దుర్గం పోషన్న సోమవారం అరటిపండ్లు, మజ్జిగ పంపిణీ చేశారు. వేసవి ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని విద్యార్థులు ఆరోగ్యంగా ఉండాలని ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఎండల వల్ల విద్యార్థులు అలసటకు గురికాకుండా తగిన శక్తి పొందేందుకు పండ్లు, మజ్జిగ ఉపయోగపడతాయని పేర్కొన్నారు. పరీక్షల సమయంలో విద్యార్థులు ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బండి వెంకటాచలం, ఉప సర్పంచ్ గిరుగుల చిన్నయ్య, బండి మహేష్, చౌదరి గోపాల్, చౌదరి శ్రీకాంత్, ముత్తినేని తిరుపతి, కుబిడే రాజన్న, తెలిగ శంకర్, ఎల్కరి తిరుపతి, లంగారి ప్రకాష్, గంధం శేఖర్, తోగామ సాయికుమార్, అల్లూరి కిషన్, పంకజ్ రాయ్ పాల్గొన్నారు.

## రోడ్డు భద్రత నియమాలను పాటించాలి



**ప్రజాపక్షం/కెరమెరి :** రోడ్డు భద్రతపై సోమవారం కెరమెరి గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ పెందోర్ ఆనందరావు అధ్యక్షతన ప్రత్యేక గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలని కోరారు. అనంతరం రోడ్డు భద్రత నియమాలను పాటిస్తామని గ్రామస్తులతో కలిసి ప్రతిజ్ఞ చేశారు. రోడ్డు మలుపులు, ప్రధాన వీధుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు మరియు రక్షణ చర్యల గురించి సభలో చర్చించి తీర్మానాలు చేశారు. గ్రామపంచాయతీ స్థాయిలో రోడ్డు భద్రత కమిటీని ఏర్పాటు చేసినట్లు సర్పంచ్ వెల్లడించారు. ప్రమాదాల నివారణకు అవసరమైన ప్రతిపాదనలను అధికారులకు పంపిస్తున్నట్లు తెలిపారు. ప్రయాణాల్లో అప్రమత్తంగా ఉండటం ద్వారా ప్రాణాపాయం నుంచి తప్పుకోవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, వార్డు సభ్యులు, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

ప్రజాపక్షం/ఖానాపూర్ రూరల్ : ఇంటర్ ఫెయిల్ అయినందుకు మనస్తాపంతో ఇంటర్ సెకండ్ ఇయర్ విద్యార్థి భుక్య ఆకాశ్(18) ఆత్మహత్య చేసుకున్న ఘటన ఖానాపూర్ మండలంలోని సత్తెనపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. ఖానాపూర్ ఎస్సై రాహుల్ గైక్వాల్ అందించిన వివరాల ప్రకారం మండలంలోని సత్తెనపల్లి గ్రామానికి చెందిన భుక్య ఆకాశ్ ఖానాపూర్ లోని ఏఆర్ఎస్ కళాశాలలో ఇంటర్ చదువుతూ ఇటీవల సెకండ్ ఇయర్ ఎగ్జామ్స్ రాసి కంప్యూటర్ శిక్షణకు గతవారం హైదరాబాద్ వెళ్ళాడు ఆదివారం మధ్యాహ్నం హైదరాబాద్ వెళ్ళాడు.ఆదివారం మధ్యాహ్నం హైదరాబాద్ నుంచి ఇంటికొచ్చి డిజె ఆపరేటర్‌గా ఓ కార్యక్రమానికి వెళ్ళాడు,అర్ధరాత్రి ఇంటికివచ్చి భోజనం ముగించుకుని పడుకొగా తెల్లారి తండి తలుపులు కొట్టగా తీయకపోగా కిటికీలోని చూసేసరికి కిటికీ గ్రిల్స్ కి టవల్ తో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తండ్రి పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రాహుల్ గైక్వాడ్ తెలిపారు.

## ఇళ్ల స్థలాలకు పట్టాలు ఇవ్వాలి

ప్రజాపక్షం/ ఆదిలాబాద్ రూరల్: నిషాన్ ఘాట్ ప్రాంత ప్రజలకు ఇళ్ల స్థలాల పట్టాలు ఇవ్వాలని, రోడ్లు, కరెంటు సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని సీపీఐ నాయకులు సోమవారం ముట్టడించారు. ఈ సందర్భంగా సీపీఐ పట్టణ కార్యదర్శి చంద్రమౌళి మాట్లాడుతూ.. ప్రభుత్వ, భూదాన్ భూముల్లో ఏళ్లుగా నివసిస్తున్న పేదలకు కనీస సౌకర్యాలు కల్పించడంలో పాలకులు విఫలమయ్యారని విమర్శించారు. నిషాన్ ఘాట్ ప్రాంతంలో మంచినీరు, రోడ్లు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం వెంటనే పట్టాలు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ధరల పెరుగుదల, నిరుద్యోగ సమస్యలపై పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు మెస్రం భాస్కర్, కృష్ణా, భాను, నిస్సర్ తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ షాపు వద్ద కనీస సౌకర్యాలు కరువు



ప్రజాపక్షం/ తలమడుగు: మండల కేంద్రంలోని రేషన్ షాపు వద్ద కనీస సౌకర్యాలు లేక వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం మూడు నెలల బియ్యం ఒకే సారి పంపిణీ చేయాలని ఉత్తర్వులు జారీ చేయడంతో లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో దుకాణం వద్దకు చేరుకుంటున్నారు. ప్రస్తుతం ఈ రేషన్ పంపిణీని స్థానిక వెంకటేశ్వర ఆలయ విశ్రాంతి గదిలో నిర్వహిస్తున్నారు. అక్కడ ఎండ నుండి రక్షణ పొందేందుకు కనీస షెల్టర్ లేకపోవడంతో వృద్ధులు, మహిళలు గంటల తరబడి ఎండలోనే వేచి ఉండాల్సి వస్తోంది. వేలిముద్రలు పడక ఆలస్యం అవుతుండటంతో తాగడానికి నీరు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తలమడుగు బస్టాండ్ ఆవరణలో రేషన్ షాపు భవనానికి స్థలం మంజూరైనప్పటికీ, ఇప్పటివరకు నిర్మాణం ప్రారంభం కాలేదు. రాబోయే వర్షాకాలంలో ఇబ్బందులు మరింత పెరగకముందే చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

# అంతరాయం లేని విద్యుత్ సరఫరాకు కృషి

ప్రజాపక్షం/ఆసిఫాబాద్ : కుమురంభీం ఆసిఫాబాద్ సర్కిల్ పరిధిలోని వినియోగదారులకు మెరుగైన, నాణ్యమైన అంతరాయాలు లేని విద్యుత్ సరఫరా అందిస్తున్నామని సూపరింటెండింగ్ ఇంజనీర్ ఉత్తమ్ జాడే తెలిపారు. వేసవి కాలంలో నిరంతర విద్యుత్ సరఫరా అందించడంలో అధికారులు, సిబ్బంది సమన్వయంతో కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. గత ఆర్థిక సంవత్సరంతో పోల్చితే ఈ ఏడాది విద్యుత్ సరఫరా వ్యవస్థలో గణనీయమైన మెరుగుదల కనిపించిందని, 11 కేవీ బ్రేక్డౌన్స్ తగ్గినట్లు వెల్లడించారు. ఓవర్ లోడ్ సమస్యలను నివారించేందుకు 751 డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు, నాలుగు పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయడంతో పాటు కొత్తగా ఆరు సబ్‌స్టేషన్లు మంజూరు చేశామని తెలిపారు. లైన్ల నిర్వహణ, వంగిన స్తంభాల సవరింపు వంటి చర్యల ద్వారా సరఫరా స్థిరత్వాన్ని పెంచామని చెప్పారు. డిజిటల్ మానిటరింగ్, రియల్ టైమ్ ఫీడర్ మానిటరింగ్ సిస్టం వంటి ఆధునిక పద్ధతుల ద్వారా సమస్యలను తక్షణమే పరిష్కరిస్తున్నామని వివరించారు. వినియోగదారులు తమ సమస్యలను సమీప సెక్షన్ కార్యాలయంలో తెలియజేయాలని, అత్యవసర పరిస్థితుల్లో టోల్ ఫ్రీ నంబర్ 1912 ద్వారా ఫిర్యాదులు చేయవచ్చని సూచించారు.

# సాగునీటి బావుల పునరుద్ధరణకు శ్రీకారం



ప్రజాపక్షం / తిర్యాని : రైతుల సాగునీటి కష్టాలను తీర్చేందుకు గ్రామీణ అభివృద్ధి సంస్థ వాసన్ నడుం బిగించింది. ఎల్ఐసి హెచ్ఎఫ్ఎల్ సౌజన్యంతో చేపట్టిన సుజల ప్రాజెక్టులో భాగంగా మండలంలోని మంద గూడ గ్రామంలో సాగునీటి బావుల పూడిక తీత కార్యక్రమాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. గత కొంతకాలంగా పూడికతో నిండిపోయి నీటి నిల్వ సామర్థ్యం తగ్గిన బావులను ఈ ప్రాజెక్టు కింద పునరుద్ధరించనున్నారు. బావుల్లో పేరుకు పోయిన మట్టిని తొలగించడం ద్వారా నీటి నిల్వ పెరగడమే కాకుండా భూగర్భ జల మట్టం కూడా మెరుగుపడుతుందని అధికారులు తెలిపారు. దీనివల్ల రైతులకు నిరంతర సాగునీరు అందుబాటులోకి వచ్చి పంటల దిగుబడి పెరగడానికి అవకాశం ఉంటుందని, వాసన్ సంస్థ తిర్యాని బ్లాక్ పరిధిలో సహజ వనరుల సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించిందని వెల్లడించారు. ఇందులో భాగంగా చెక్ డ్యామ్‌లు, ఫార్మ్ పాండ్లు, వర్షపు నీటి సంరక్షణ కట్టడాల నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. సాగునీటి వనరులు మెరుగుపడటం పట్ల స్థానిక రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో మందగూడ సర్పంచ్ తుంరం గోపాల్, వాసన్ సంస్థ ప్రతినిధులు రాజశేఖర్, మారుతీ, ప్రమీల, స్థానిక రైతులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# వన్యప్రాణుల సంరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి



ప్రజాపక్షం / కాసిపేట : బెల్లంపల్లి డివిజన్ పరిధిలోని బెల్లంపల్లి రేంజ్ ముత్యంపల్లి సెక్షన్‌లో సోమవారం అటవీ మండలాధికారి విజయ్ కుమార్ పర్యటించారు. ఈ సందర్భంగా అటవీ ప్రాంతంలో వన్యప్రాణుల దాహార్తి తీర్చేందుకు ఏర్పాటు చేసిన నీటి కుంటలు, చెక్ డ్యామ్‌లు, సహజ నీటి ఊటలను ఆయన పరిశీలించారు. అటవీ ప్రాంతాల సంరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, పశువులను అడవిలోకి అనుమతించకుండా కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. గ్రామాల్లోనే పశువులకు తగిన నీటి వసతులు కల్పించేలా గ్రామ పంచాయతీ అధికారులతో సమన్వయం చేసుకోవాలని తెలిపారు. వన్యప్రాణులు దాహార్తి తీర్చుకోవడానికి గ్రామాల్లోకి వస్తే వెంటనే అటవీ అధికారులకు సమాచారం అందించాలని కోరారు. వేటను అరికట్టేందుకు నిఘా వ్యవస్థను బలోపేతం చేయాలని, అటవీ అగ్నిప్రమాదాలు జరగకుండా గ్రామ సభల ద్వారా ప్రజల్లో అవగాహన పెంపొందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి క్షేత్రాధికారి చ. పూర్ణచందర్, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ బి. ప్రవీణ్ నాయక్, సెక్షన్ ఆఫీసర్ శ్రీధర్ పాల్గొన్నారు.

# వైద్య సేవలపై నీతి ఆయోగ్ అధికారి ప్రశంసలు



ప్రజాపక్షం / తిర్యాణి : మండల పర్యటనలో భాగంగా జిల్లా కలెక్టర్ హరితతో కలిసి నీతి ఆయోగ్ ప్రత్యేక అధికారి రంజిత్ కుమార్ తిర్యాణి ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవలను సమీక్షించి డాక్టర్లు, సిబ్బంది పనితీరుపై ఆయన సంతృప్తి వ్యక్తం చేస్తూ ప్రత్యేకంగా అభినందించారు. తనిఖీలో భాగంగా ఔట్‌పేషంట్, ఇన్‌పేషంట్ రిజిస్టర్లను అధికారులు సవివరంగా పరిశీలించారు. ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న వైద్య సదుపాయాలు, రోగులకు అందిస్తున్న చికిత్స గురించి డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. మండలంలో గర్భిణుల ప్రసవాలన్నీ ఆసుపత్రిలోనే జరుగుతున్నాయని తెలుసుకున్న రంజిత్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో సంస్థాగత ప్రసవాలను ప్రోత్సహించడం ఎంతో కీలకమని పేర్కొంటూ డాక్టర్ల బృందాన్ని ప్రశంసించారు. ఇదే స్ఫూర్తితో ప్రజలకు నిరంతరం మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆరోగ్య శాఖాధికారి సీతారాం, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపిడిఒ మల్లేష్, డాక్టర్లు కృష్ణ, అక్షయ్, పల్లవి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# హెల్మెట్ ధరిస్తేనే ప్రాణాలకు రక్షణ

శ్రీరాంపూర్ ఎస్ఐ మేకల సంతోష్

ప్రజాపక్షం / శ్రీరాంపూర్ : వాహనదారులు హెల్మెట్, సీట్ బెల్టు ధరిస్తూ రోడ్డు ప్రయాణాలు చేస్తేనే జీవితం సురక్షితంగా ఉంటుందని శ్రీరాంపూర్ ఎస్ఐ మేకల సంతోష్ అన్నారు. సోమవారం శ్రీరాంపూర్ ప్రాంతంలోని కొత్త రోడ్డు ఆర్కె 6 సమీపంలో సిఐ ఆకుల అశోక్ ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన అరైవ్ అలైవ్ అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరు రోడ్డు భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ప్రమాదాలు ఎప్పుడు ఎలా వస్తాయో తెలియదని, చిన్నపాటి నిర్లక్ష్యం పెద్ద ప్రమాదాలకు దారి తీస్తుందని హెచ్చరించారు. ప్రయాణాలలో హెల్మెట్ లేకపోతే కుటుంబాలు నష్టపోవాల్సి వస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటారని స్పష్టం చేశారు. ఏ ఒక్కరు ప్రాణాలను ప్రమాదంలో పెట్టేలా నిర్లక్ష్యంగా వాహనాలు నడపవద్దని కోరారు. ఈ సందర్భంగా స్థానిక యువత రోడ్డు భద్రత నియమాలను పాటిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ గుమ్మడి శ్రీనివాస్, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, యువత పాల్గొన్నారు.

## రక్తదానం మరొకరికి ప్రాణదానం



ప్రజాపక్షం / శ్రీరాంపూర్ : మనం చేసే రక్తదానం ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి ప్రాణదానంతో సమానమని సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ రాష్ట్ర అధ్యక్షులు తుమ్మల రాజారెడ్డి అన్నారు. సోమవారం నస్పూర్ ప్రెస్ క్లబ్ లో సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షతన మహాత్మ జ్యోతిరావు పూలే, అంబేద్కర్ జయంతులను పురస్కరించుకొని రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. తలసేమియా, సికిల్ సెల్ వ్యాధిగ్రస్తుల కొరకు రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ రక్తదానం చేయడాన్ని బాధ్యతగా భావించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి వివిధ గనుల నుండి 146 మంది కార్మికులు రక్తదానం చేయడానికి ముందుకు రావడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. రక్తదానం చేసిన కార్మికులకు, ఇద్దరు అధికారులకు యూనియన్ తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఆపదలో ఉన్న వారికి రక్తం అందించి ప్రాణాలు కాపాడడం గొప్ప విషయమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ ప్రెసిడెంట్ గుల్ల బాలాజీ, కార్యదర్శి కస్తూరి చంద్రశేఖర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ వెంగళ శ్రీనివాస్, బ్రాంచ్ నాయకులు మిడివెల్లి శ్రీనివాస్, సాయిల శ్రీనివాస్, శ్రీపతి బానేష్, పేరుక సదానందం, తోడే సుధాకర్, మెల్లం శ్రీధర్, నరేష్, వెంకటరెడ్డి, సిరికొండ శ్రీనివాస్, సమ్మయ్య, ప్రవీణ్ పాల్గొన్నారు.

## నిబంధనలు పాటించి ప్రమాదాలు నివారించాలి



ప్రజాపక్షం / జన్నారం : గ్రామంలో రోడ్డు భద్రతపై అవగాహన కల్పించేందుకు రోడ్డు సేఫ్టీ గ్రామ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ జక్కు సుష్మ భూమేష్ మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలను తగ్గించవచ్చని, డ్రైవర్లు మద్యం సేవించి వాహనాలు నడపకూడదని, చిన్న పిల్లలకు బైకులు ఇవ్వకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. యువత డ్రగ్స్ బానిసలుగా మారకుండా కుటుంబ సభ్యులు, పెద్దలు పర్యవేక్షణ చేయాలని తెలిపారు. అత్యవసర సేవల్లో విశేష సేవలు అందిస్తూ ఇటీవల అవార్డులు అందుకున్న 108 డ్రైవర్లు ఎం.డి రఫీక్, అరిగెల కిష్టన్లను ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు. వారి సేవలను అభినందిస్తూ సర్పంచ్, అధికారులు ప్రశంసలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇఒ రాహుల్, వార్డు సభ్యులు,

## నిర్మల్ గడ్డ..చలన చిత్రాలకు అడ్డా

ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ : నిర్మల్ జిల్లా వాసులు చలనచిత్ర రంగంలో అడుగుపెట్టడం ఎంతో అభినందనీయమని నిర్మల్ మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి పేర్కొన్నారు.కొప్పుల క్రియేషన్స్ పతాకంపై రూపొందుతున్న 'ద ఎంప్టీ సీట్' చిత్ర ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపి,సినిమా పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ,నిర్మల్ జిల్లా చారిత్రక సంపదకు నిలయమని,ఇక్కడి ప్రాంతాలు సినిమా షూటింగులకు ఎంతో అనువైనవని తెలిపారు.జిల్లాలోని పురాతన కోటలు,బురుజులు,గొలుసుకట్టు చెరువులు పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటాయని వివరించారు.కేవలం పట్టణమే కాకుండా,జిల్లా నలుమూలలా ఉన్న బాసర జ్ఞాన సరస్వతి క్షేత్రం, కుంతాల జలపాతం,కవ్వాల్ వన్యప్రాణి అభయారణ్యం,గోదావరి పరివాహక ప్రాంతాలు చలన చిత్రాల్లో చూపిస్తే ఈ ప్రాంతానికి మరింత గుర్తింపు లభిస్తుందని ఆకాంక్షించారు.స్థానిక యువత దర్శకులుగా,నిర్మాతలుగా ఎదగడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. చిత్ర పరిశ్రమ ఇక్కడ విస్తరిస్తే స్థానిక కళాకారులకు,ఉపాధికి ఎంతో మేలు జరుగుతుందని అభిప్రాయపడ్డారు.మొట్టమొదటి సారిగా చిత్ర పరిశ్రమలోకి అడుగుపెడుతున్న దర్శకుడు ద్యాగ స్వామి, నిర్మాత కొప్పుల చిన్నయ్యలను ఆయన ప్రత్యేకంగా అభినందించి, సినిమా ఘనవిజయం సాధించాలని కోరారు.ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు,చిత్ర యూనిట్ సభ్యులు పాల్గొన్నారు.

# అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలి



ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ : అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలని, ప్రజావాణి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి అర్జీలను పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ డి.వేణు సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమం సందర్భంగా సమీకృత జిల్లా కలెక్టరేట్ లో ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు. ధర్మారం మండలం కటికనపల్లి గ్రామానికి చెందిన ఎం.డి.ఖాసిం గ్రామ శివారులో సర్వే నెంబర్ 1211/2 లోని 14 గుంటల భూమి ఆన్ లైన్ లో వేరే పేరు మీద ఉందని, అది తమ పేరు పై మళ్లీ రిజిస్టర్ చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా తహసిల్దార్ ధర్మారం కు రాస్తూ విచారణ చేసి అవసరమైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ తెలిపారు.పెద్దపల్లి మండలం రంగాపూర్ గ్రామానికి చెందిన గండు రాజయ్య వీ.ఎస్.బి బ్రిక్స్ నుండి దుమ్ము ధూళి బూడిద తమ వ్యవసాయ భూమిలోకి వచ్చి కూరగాయల తోటలో పంట నష్టం కలుగుతుందని చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా తహసిల్దార్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు.జూలపల్లి మండలం కుమ్మరికుంట గ్రామానికి చెందిన తమ్మనవేని మధుకర్ యాదవ్ తమకు మంజూరైన ఇందిరమ్మ ఇండ్లలో రేకుల షెడ్డు నిర్మాణానికి అనుమతించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా పీడీ హౌసింగ్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు.ప్రజావాణి కార్యక్రమంలో సంబంధిత జిల్లా అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన కాంగ్రెస్ నాయకులు

ప్రజాపక్షం/ముత్తారం: పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం లోని అడవిశ్రీరాంపూర్ గ్రామానికి చెంద్దిన మెట్టు సరోజన కుమారుడు రాకేష్‌మాధురి వివాహానికి వేడుకలకు కాంగ్రెస్ పార్టీ నాయకులు ముగ్గ రవి,మాజీ వార్డు సభ్యుడు అశోక్ అశోక్ చారి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.వారి వెంట సాధ స్వామి,విజేందర్ రాజు తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీపాద రావు సేవలు మరువలేనివి

ప్రజాపక్షం/పెద్దపల్లిటౌన్: స్వర్గీయ మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాద రావు సేవలు మరువలేనివని జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు భూషణవేణ సురేష్ గౌడ్ అన్నారు.పెద్దపల్లి పట్టణంలో సోమవారం శ్రీపాద రావు 27వ వర్ధంతి నిర్వహించారు.శ్రీపాద రావు చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అన్నయ్య గౌడ్, సురేష్ గౌడ్ మాట్లాడుతూ సుదీర్ఘ కాలం పాటు రాష్ట్ర ప్రజల కోసం అహర్నిశలు కృషి చేసిన మహనీయుడు శ్రీపాద రావు అని కొనియాడారు. అనంతరం పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు గుజ్జుల కుమార్, మంథని నర్సింగ్, తూముల సుభాష్ రావు, పాగాల శ్రీకాంత్, పూదరి మహేందర్, అమ్రేష్, నదీం, తిర్రి రాజు, నాంసాని శ్రీనివాస్, నాయకులు శ్రీమాన్, బూతగడ్డ సంపత్, కటికనపల్లి రవి, అమిరిశెట్టి తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

## డా: బి.ఆర్.అంబేద్కర్ జయంతి వేడుకల ఏర్పాట్ల

ప్రజాపక్షం/రామగిరి : డా.బి.ఆర్. అంబేడ్కర్ 135వ జయంతిని పురస్కరించుకొని మంగళవారం రామగుండం3, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియాల ఆధ్వర్యంలో నిర్వహించనున్న జయంతి వేడుకల కోసం స్థానిక రాణి రుద్రమదేవి క్రీడా ప్రాంగణం ముందు గల అంబేద్కర్ విగ్రహం వద్ద చేస్తున్న ఏర్పాట్లను సోమవారం రామగుండం3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్ పరిశీలించారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ నిర్దేశించిన పనులను, ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. వేడుకలకు హాజరయ్యే వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సత్య నారాయణ, సివిల్ డిజియం రాజేంద్ర కుమార్, పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనం, ఎస్సీ లైజన్ ఆఫీసర్ జి.మహేష్, ఉన్నారు.

## మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాద రావు 27వ వర్ధంతి



ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల : మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాద రావు 27వ వర్ధంతి వేడుకలను జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. చిత్రపటానికి పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా డిసిసి అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్ మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రానికి ఆయన చేసిన సేవలు మరువలేనివి అన్నారు. ఆయన రాజకీయ జీవితం మంథని నియోజకవర్గం లోని ధన్వాడలో సర్పంచ్ గా మొదలు చేసి ఐదు సార్లు శాసనసభ్యులుగా, స్పీకర్ గా బడుగు బలహీన అట్టడుగు వర్గాల వారికి సేవలు చేసిన మహనీయుడని కొనియాడారు. ఆయన ఆశయాలకు అనుగుణంగానే వారి కుమారులు మంథని నియోజకవర్గానికి సేవలు అందిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు చొప్పదండి ప్రకాష్, గడ్డం నరసయ్య, కౌన్సిలర్ సభ్యులు వెంగళ లీల లక్ష్మీ నరసయ్య, బైరి ప్రభాకర్ విజయనిర్మల,బొద్దుల శ్రీనివాస్, ఆకునూరి బాలరాజు,బొప్ప దేవయ్య, రెడ్డి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## మక్కల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చెయ్యాలి



ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ : పెద్దపల్లి మండలంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు పెంచాలని ప్రజావాణి లో అదనపు కలెక్టర్ కు కొత్తపల్లి గ్రామ యువ రైతులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాలసాని లెనిన్ మాట్లాడుతూ రైతులు పండించిన మొక్క జొన్న ప్రభుత్వం పూర్తి స్థాయి లో కొనుగోలు చెయ్యకపోవడం ద్వారా రైతులు తక్కువ ధరలకే దళారులకు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఉందని మార్కెట్ లో క్వింటల్ 2409 రూపాయలు ఉండగా దళారులకి 1800 కే అమ్ముకునే పరిస్థితి ఉందని అన్నారు ప్రభుత్వం అదేవిధంగా అధికారులు పంట మార్పిడి చెయ్యాలని చెప్పడంతో రైతులు మొక్క జొన్న వేశారని, వడ్ల లాగానే మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చెయ్యాలని కోరారు. ఈ కార్యక్రమంలో బాలసాని లెనిన్,కళావేన రాము, కళావేన మహేష్, కళావేన వెంకటేష్,తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ మేట్ ని తొలగించాలంటూ ధర్నా



ప్రజాపక్షం/ముత్తారం: పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని పోతారం గ్రామంలో ఉపాధి హామీ పథకంలో భాగంగా మేటుగా పనిచేస్తున్న వ్యక్తిని తొలగించాలంటూ ఎంపీడీవో కార్యాలయం ముందు సోమవారం ఉపాధి హామీ కూలీల ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 100 రోజుల పనిమీద గతంలో జరిగిన ఉపాధి హామీ పనుల్లో జరిగిన అవినీతి గురించి జిల్లా కలెక్టర్ కి,ఎంపీడీవో కి ఫిర్యాదు చేయడం జరిగిందని ఊట్ల శ్రీనివాస్ తెలిపారు. ఉపాధి హామీ పనుల్లో భాగంగా మేటీలను పెట్టి పనులు చేపిస్తుండడంతో అవినీతి జరుగుతుందని పూర్తిస్థాయిలో ఫీల్డ్ అసిస్టెంట్ ని కొనసాగించాలని ఎంపీడీవో ముందు ధర్నా నిర్వహించారు.ఈ ధర్నా విషయం తెలుసుకున్న ముత్తారం ఎస్ఐ రవికుమార్ ఘటన స్థలానికి వచ్చి ఆందోళన చేస్తున్న వారికి నచ్చజెప్పి ఎంపీడీవో సురేష్ ఉపాధి హామీ కూలీలతో మాట్లాడి ప్రతి 40 మందికి ఒక మేటును రూల్ ప్రకారం పెట్టాలని ఉపాధి హామీలో ఎలాంటి అవకతవకలు జరగకుండా చూస్తామని ఎంపీడీవో హామీ ఇవ్వడంతో కూలీలు శాంతించారు.

## చలివేంద్రం ప్రారంభం

ప్రజాపక్షం/వీర్నపల్లి: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో చలి వేంద్రాన్ని ప్రజలకు అందుబాటులో ఉండేలా ఏర్పాటు చేశారు. సర్పంచ్ మల్లారపు జోత్స్న అరుణ్‌కుమార్, పాలక వర్గ సభ్యులతో కలిసి చలి వేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎండ తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో బాటసారుల దాహార్తిని తీర్చేందుకు చలి వేంద్రాన్ని ఏర్పాటు చేశామని, వేసవి కాలం ముగిసే వరకు ప్రజలందరికి నిరంతరం చల్లని తాగునీరు అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ నరేష్, మల్లేశం, లక్ష్మన్, ఏఎంసీ డైరెక్టర్ చంద్రమౌళి, మాజీ ఉప సర్పంచ్ రవి, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## విద్యుత్ వోల్టేజ్ సమస్యకు శాశ్వత పరిష్కారం

ప్రజాపక్షం/ముస్తాబాద్ : తెర్లుమద్ది గ్రామంలో సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, ఎస్ఈ భిక్షపతి, డీఈ అశోక్, ఏఈ విష్ణు తేజ గ్రామాన్ని సందర్శించి ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించారు. గ్రామంలో దీర్ఘకాలంగా కొనసాగుతున్న లో వోల్టేజ్ సమస్యపై సర్పంచ్ బైతిదుర్గమ్మ నవీన్ అధికారులకు వివరించారు. సమస్య తీవ్రతను గుర్తించిన అధికారులు వెంటనే స్పందించి పరిష్కార చర్యలు చేపట్టారు. గ్రామంలో సింగిల్ ఫేస్ డి టి ఆర్ ను సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి ప్రారంభించారు.వోల్టేజ్ సమస్యను సమర్థవంతంగా పరిష్కరించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు ఎన్ పి డి సి ఎల్ అధికారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం సర్పంచ్ బైతి దుర్గమ్మ నవీన్, అంజిరెడ్డి, ఏఈ విష్ణు తేజతో, జగదీష్ , లైన్మెన్ రాంబాబు , వెంగల్ రెడ్డి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## శ్రీపాదరావు సేవలు మరువలేనివి

ప్రజాపక్షం/చందుర్తి : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ స్పీకర్ దివంగత నేత దుద్దిల్ల శ్రీపాద రావు సేవలు మరువలేనివని రాజన్న సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు భీమ రాజు కనకరాజు అన్నారు.శ్రీపాదరావు వర్ధంతి సందర్భంగా మండలం లోని రామన్న పేట గ్రామం లో సోమవారం పలువురు నాయకుల తో కలిసి ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమం లో మాజీ ఉప సర్పంచ్ నారాయణ, మాజీ వార్డు సభ్యులు దుమ్ము శంకర్ , మార్కెట్ కమిటీ డైరెక్టర్ కత్తి శంకర్ ,దొంతుల మహిపాల్ రెడ్డి ,మాజీ ఎంపిటిసి రాములు,తిప్పని శంకర్ , నారాయణ , భూమయ్య , రాజయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.

## నూతన తహసీల్దార్‌కు సన్మానం

ప్రజాపక్షము/ముస్తాబాద్: ముస్తాబాద్ మండలానికి బదిలీపై వచ్చిన తాసిల్దార్ ఫరూక్ ను కొండాపూర్ సర్పంచ్ మహేందర్ రెడ్డి తాసిల్దార్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వెంట గ్రామస్తులు ఉన్నారు.

## మున్సిపల్ కోఆప్షన్ సభ్యుల ఎన్నిక

ప్రజాపక్షం/రాజన్నసిరిసిల్ల:సోమవారం సిరిసిల్ల మున్సిపల్ ప్రత్యేక సాధారణ సమావేశం మున్సిపల్ చైర్మన్ కళ చక్రపాణి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో మున్సిపల్ జనరల్ మరియు మైనారిటీ కోఆప్షన్ సభ్యులను ఎన్నుకున్నారు. బిఆర్ఎస్ పార్టీ బలపరిచిన నంది శంకర్, సయ్యద్ సోహెల్, కొండ అనూష శ్రీనివాస్, సయ్యద్ తస్లీమ్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన కోఆప్షన్ సభ్యులతో మున్సిపల్ చైర్మన్ జిందం కళ చక్రపాణి, మున్సిపల్ కమిషనర్ ఖాదిర్ పాషా ప్రమాణ స్వీకారం చేయించారు.

**నూతన కో ఆప్షన్ సభ్యులకు సన్మానం..**

నూతనంగా ఎన్నికైన మున్సిపల్ కోఆప్షన్ సభ్యులను మున్సిపల్ చైర్మన్ జిందం కళ చక్రపాణి, కమిషనర్ ఖాదిర్ పాషా, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య, జిందం చక్రపాణి, వైస్ చైర్మన్ దార్ల సందీప్, గూడూరి ప్రవీణ్ కౌన్సిలర్ సభ్యులు ఘనంగా శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.

## వాహనదారుడు సామాజిక బాధ్యతగా భద్రత ప్రమాణాలు పాటించాలి

ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల: వాహనదారుడు సామాజిక బాధ్యతగా భద్రత చర్యలు తీసుకోవాలని జిల్లా రవాణా శాఖ అధికారి వి.లక్ష్మణ్ అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా రవాణా శాఖ ఆఫీసులో సోమవారం ప్రజా పాలన.. ప్రగతి ప్రణాళిక, 99 రోజుల కార్యక్రమంలో భాగంగా వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాహనదారులందరూ భద్రత ప్రమాణాలను పాటించాలన్నారు. హెల్మెట్ ధరించడం, సీట్ బెల్ట్ పెట్టుకోవడం, నిదానంగా ప్రయాణించడం, రోడ్డు భద్రత సూచనలు పాటించాలన్నారు. సురక్షిత ప్రయాణమే లక్ష్యంగా ప్రతి ఒక్కరు.. ప్రమాద రహిత సమాజం కోసం కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎం విజ పృథ్వీరాజ్ వర్మ, రవాణా శాఖ సిబ్బంది కల్పన, రమ్య, సౌమ్య పాల్గొన్నారు.

# అంగన్వాడీ కేంద్రాల్లో పోషణ పక్వాడ కార్యక్రమం



**ప్రజాపక్షం/గొల్లపల్లి :** గర్భధారణ సమయంలో తల్లి తీసుకునే పౌష్టికాహారం, పుట్టబోయే బిడ్డ ఆరోగ్యకరమైన పెరుగుదలకు ఎంతగానో దోహదపడుతుందని, పోషకాహారంతోనే చిన్నారులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని,ఐసిడిఎస్ సూపర్వైజర్ జానకి అన్నారు .సోమవారం జగిత్యాల జిల్లా గొల్లపల్లి సెక్టర్ పరిధిలోని లక్ష్మీపూర్ గ్రామంలోని అంగన్వాడి ఒకటి, రెండవ కేంద్రాల్లో సూపర్వైజర్ జానకి ఆధ్వర్యంలో పోషణ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా సూపర్వైజర్ జానకి మాట్లాడుతూ గర్భిణుల నుంచి రెండేళ్లలోపు చిన్నారులకు పోషకాహారం, ఆరోగ్యం, విద్యా విషయాలపై అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమన్నారు. గర్భధారణ సమయంలో తీసుకోవాల్సిన పోషకాహారంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రతి గర్భిణి, బాలింత, చిన్నారికి సరైన పోషకాహారం అందేలా, పిల్లల ఎత్తు, బరువులను క్రమం తప్పకుండా తనిఖీ చేస్తూ, పోషకాహార లోపం ఉన్న వారికి అవసరమైన విటమిన్ టాబ్లెట్లు,నాణ్యమైన ఆహారాన్ని అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందజేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా పిల్లల తల్లిదండ్రులు వాళ్ళ ఇంటికి వెళ్లి ఇంట్లో వంట కార్యక్రమం ఏర్పాటు చేసి పోషక విలువలు గల ఆహార పదార్థాలు వారిచేత తయారు చేయించి మీ పిల్లలకు ఇలాంటి సరైన పోషక విలువలు కలిగిన పదార్థాలు అందించాలని సూచించారు.ప్రతి ఒక్కరు ఇంటి లోపల కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేసుకోవాలని గర్భిణీలను బాలింతలను పిల్లల తల్లులను కోరారు.ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ జానకి, అంగన్వాడి టీచర్లు మానాల తిరుమల,మ్యాడ వరం స్వప్న,ఆశా కార్యకర్తలు లక్ష్మి ,రాధ ,తల్లులు ,పిల్లలు పాల్గొన్నారు.

## కొండగట్టు దీక్ష స్వాముల ముడుపుల ఆదాయం లెక్కింపు

**ప్రజాపక్షం/మల్యాల:**జగిత్యాల జిల్లా మల్యాల మండలం కొండ గట్టు ఆంజనేయ స్వామి ఆలయానికి 1లక్ష 69వేల 69 రూపాయలు వచ్చినట్లు ఈవో అంజన రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. స్వామివారి చిన్న జయంతి ఉత్సవాల సందర్భంగా దీక్ష స్వాములు సమర్పించిన ముడుపులు సోమవారం విప్పి లెక్కించగా ఈ ఆదాయం వచ్చిందన్నారు.ఈ కార్యక్రమంలో ఆలయ కార్య నిర్వహణ అధికారి అంజనారెడ్డి, ఆలయ ఏఈవో హరిహరనాథ్,పర్యవేక్షకులు సునీల్ కుమార్,ఉప ప్రధాన అర్చకులు చిరంజీవి స్వామి,కపిందర్,ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఖుతుబోద్దీన్ పాషా, అజీమ్ కుటుంబాలకు డాక్టర్ రఘు పరామర్శ

**ప్రజాపక్షం/మెట్‌పల్లి :** కాంగ్రెస్ పార్టీ పట్టణ మాజీ అధ్యక్షుడు మహమ్మద్ ఖుతుబోద్దీన్ పాషా, మెట్‌పల్లి ప్రెస్ క్లబ్ ప్రింట్ మీడియా ప్రధాన కార్యదర్శి మహ్మద్ అజీమ్‌ల తల్లి మృతి పట్ల నిత్య సాయి ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ రఘు గాఢ సంతాపం వ్యక్తం చేశారు.ఇటీవల వారి తల్లి మరణించగా, సోమవారం డాక్టర్ రఘు, నల్ల వెంకట్ కలిసి వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు.ఈ సందర్భంగా మృతికి గల కారణాలను తె లుసుకుని , కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు .మృతురాలి ఆత్మకు శాంతి చేకూరాలని, ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులకు ధైర్యం కలగాలని ఆకాంక్షించారు.

## వాలీబాల్ టోర్నమెంట్ విజేత టిఆర్ బి జట్టు

**ప్రజాపక్షం/రాయికల్ :** మహాత్మ జ్యోతిరావ్ బాపూలే అంబేద్కర్ జయంతి ఉత్సవాల సందర్భంగా రాయికల్ పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలురు ఆవరణలో ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం రాయికల్ శాఖ నిర్వహిస్తున్న మండలస్థాయి వాలీబాల్ టోర్నమెంట్ లో టి ఆర్ బి జట్టు ప్రథమ స్థానంలో , ద్వితీయ స్థానంలో తాట్లవాయి గ్రామజట్టు నిలిచాయని ఫిజికల్ డైరెక్టర్ పుర్రె రమేష్ తెలిపారు. గెలుపు సాధించిన క్రీడాకారులకు అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు నాయకులు, ఉపాధ్యాయులు,మున్సిపల్ చైర్మన్ కట్కం రవీందర్,కౌన్సిలర్ పుర్రె శ్రీధర్,తదితరులు,అభినందనలు తెలిపారు.

# పెట్రోల్ బాటిల్‌తో ప్రజావాణికి వచ్చిన మహిళ



**ప్రజా పక్షం/ఇబ్రహీంపట్నం :** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం వేముల కుర్తి గ్రామానికి చెందిన గుగులోతు లక్ష్మి తన కుటుంబ సమస్యను తెలియజేయడానికి సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి పెట్రోల్ బాటిల్‌తో హాజరైంది. ఈ సంఘటన అక్కడికి వచ్చిన వారిని ఆందోళనకు గురిచేసింది.లక్ష్మి మాట్లాడుతూ, తనకు సొంత ఇల్లు లేకపోవడంతో కిరాయి ఇంట్లోనే నివసిస్తున్నానని తెలిపింది. అయితే ఆ ఇంటిలో ఉన్న కరెంటు మీటర్‌ను విద్యుత్ శాఖ సిబ్బంది తీసుకెళ్లడంతో, తమ కుటుంబం చీకట్లోనే జీవనం సాగిస్తున్నామని ఆమె వాపోయింది. కరెంటు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపింది. ఈ నేపథ్యంలో వెంటనే కరెంటు మీటర్ ఏర్పాటు చేసి తమ సమస్యను పరిష్కరించాలని ప్రజావాణి కార్యక్రమంలో సంబంధిత విద్యుత్ శాఖ అధికారులను లక్ష్మి వేడుకుంది.ఈ ఘటన ప్రజావాణి కార్యక్రమంలో చర్చనీయాంశంగా మారింది. అధికారులు తన సమస్యపై స్పందించి తక్షణ చర్యలు తీసుకోవాలని లక్ష్మి కోరుతుంది. దీనిపై ప్రజాపక్షం రిపోర్టర్ విద్యుత్ శాఖ ఏఈ సతీష్ ను వివరణ కోరడంతో విద్యుత్ శాఖ వివరణ ఇస్తూ గుగులోతు లక్ష్మి కిరాయికి ఉంటున్న ఇల్లు గుడ్ల లక్ష్మి కి చెందిందని ఇంటి ఓనరు ఆ విద్యుత్తు మీటర్ మీద ఉన్న బకాయిలను పూర్తిగా చెల్లించి విద్యుత్తు మీటర్ కనెక్షన్ ను ఇంటి ఓనర్ గుడ్ల లక్ష్మి తమకు వినతి పత్రం ఇవ్వడంతో ఆమె వినతి మేరకు తమ విద్యుత్తు సిబ్బంది మీటర్ ను తొలగించినట్లు మండల విద్యుత్తు ఏఈ సతీష్ వివరణ ఇచ్చారు.

# సైబర్ క్రైమ్ పై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉన్నాయి



**ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ :** ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంపొలాసలోని సోమవారం విద్యార్థుల కోసం సైబర్ క్రైమ్ అవగాహన సదస్సు ఘనంగా నిర్వహించబడింది.కళాశాల ఆడిటోరియంలో జరిగిన ఈ కార్యక్రమానికి సైబర్ క్రైమ్ విభాగం ఎస్.ఐలు కృష్ణ, దినేష్ కుమార్ అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా సైబర్ క్రైమ్ ఎస్.ఐలు మాట్లాడుతూ....ప్రస్తుతం పెరుగుతున్న సాంకేతికతతో పాటు సైబర్ నేరాలు కూడా పెరిగిపోతున్నాయని, విద్యార్థులు సోషల్ మీడియా, డిజిటల్ లావాదేవీల పట్ల అత్యంత అప్రమత్తంగా ఉండాలని వారు సూచించారు. ఫిషింగ్ స్కామ్స్, ఆన్లైన్ మోసాల నుండి ఎలా రక్షణ పొందాలి,సైబర్ హైజీన్ ప్రాముఖ్యతను వారు వివరించారు. షీ టీమ్ సభ్యురాలు పూజిత మాట్లాడుతూ మహిళల భద్రత కోసం పోలీస్ శాఖ తీసుకుంటున్న చర్యలను ఆమె వివరించారు. ఆన్లైన్, ఆఫ్లైన్ వేధింపులకు గురైతే వెంటనే షీ టీమ్స్ ను సంప్రదించాలని పూజిత కోరారు. జగిత్యాల పోలీస్ కళాబృందం వారు తమ ఆటపాటలతో సైబర్ నేరాలపై విద్యార్థులకు కళ్ళకు కట్టినట్లు అవగాహన కల్పించారు.కళాశాల అసోసియేట్ డీన్ డా.నీరజ ప్రభాకర్ మాట్లాడుతూ.. విద్యార్థులు బాధ్యతాయుతమైన డిజిటల్ పౌరులుగా ఎదగాలని, ఇలాంటి సదస్సులు వారి భవిష్యత్తుకు ఎంతో ఉపయోగపడతాయని వారు తెలిపారు.అనంతరం డా.బి.ఆర్. అంబేద్కర్ జయంతి పురస్కరించుకొని నిర్వహించిన పోటీల్లో విజేతలకు ఈ సందర్భంగా బహుమతులు ప్రధానం చేశారు.ఈ కార్యక్రమంలో డా.రత్నాకర్, డా.బి.సౌజన్య, బోధనా సిబ్బంది, పెద్ద సంఖ్యలో విద్యార్థులు, పాల్గొన్నారు.

# రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు



**ప్రజాపక్షం /కథలాపూర్ :** జగిత్యాల జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్, జిల్లా కలెక్టర్ ల ఆదేశాల మేరకు కథలాపూర్ మండలం తాండ్రియాల గ్రామంలో "అరైవ్ అలైవ్" కార్యక్రమంలో భాగంగా రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో ఎంపిడివో ఎం.శంకర్ ,రెవెన్యూ ఇన్స్పెక్టర్ రవి , ఆర్అండ్‌బీ, ఆరోగ్యశాఖల అధికారులు మరియు గ్రామపంచాయతీ సర్పంచ్ జంగ శివాని రంజిత్,ఉపసర్పంచ్ అల్లూరి జనార్ధన్ రెడ్డి,వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు. ఇట్టి కార్యక్రమంలో బిటి రోడ్లు, స్థానిక రహదారులపై బ్లాక్ స్పాట్ లు, ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి ప్రమాదాల నివారణకు సమష్టిగా అవసరమైన నివారణ చర్యలు చేపట్టారు,ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటిస్తామని గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు.గ్రామస్తుల సహకారంతో కొన్ని చోట్ల గుంతలు కూడా పూడ్చినామని కథలాపూర్ ఎస్సై రవికిరణ్ తెలిపారు.

## ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య



**ప్రజాపక్షం/మల్లాపూర్:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను విద్యార్థులకు అనుకూలంగా తీర్చిదిద్ది మెరుగైన విద్యను అందిస్తుందని పాతదామరాజ్ పల్లి సర్పంచ్ రొండ్ల రాజేశ్వరి రాజారెడ్డి అన్నారు. ఈ సందర్భంగా సోమవారం గ్రామంలో మన ఊరు మన బడి కార్యక్రమంలో భాగంగా మన ఊరి పిల్లలను మనబడిలోనే చేర్పించాలని ప్రభుత్వ పాఠశాలలోనే మెరుగైన విద్యార్థులు అని తల్లిదండ్రులకు సూచించారు. ప్రైవేట్ పాఠశాలలో చదివించడం ద్వారా లక్షలాది రూపాయలు ఫీజులు చెల్లించి ఆర్థికంగా తల్లిదండ్రులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని,మీకు మేమున్నం ప్రభుత్వ పాఠశాలల్లోని పిల్లలను చేర్చాలని కోరుతూ ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ రొండ్ల రాజేశ్వరి రాజారెడ్డి, ప్రధానోపాధ్యాయుడు వేణు ,ఉపాధ్యాయులు అరుణ్, గ్రామస్తులు, తదితరులున్నారు.

## వేగం కంటే ప్రాణం ముఖ్యం -రోడ్డు నిబంధనలు పాటించాలి

**ప్రజాపక్షం /పెగడపల్లి :** రోడ్డు ప్రమాదాల నివారణే ధ్యేయంగా తెలంగాణ పోలీస్ శాఖ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అరైవ్ అలైవ్ అవగాహన కార్యక్రమం సోమవారం పెగడపల్లి మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎస్ఐ కిరణ్ కుమార్, సర్పంచ్ ఓరుగల అరుణ, ఏఎంసీ చైర్మన్ బుర్ర రాములు గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్ఐ కిరణ్ కుమార్ మాట్లాడుతూ, మితిమీరిన వేగం, హెల్మెట్ ధరించకపోవడం వల్ల అనేక కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని సూచించారు. అనంతరం సర్పంచ్ అరుణ మాట్లాడుతూ, గ్రామంలో రోడ్డు భద్రతపై ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఉండాలని కోరారు. గ్రామస్తులందరితో కలిసి రోడ్డు భద్రతా నిబంధనలు పాటిస్తామని ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు నంది మహిపాల్, మక్కపెల్లి మల్లేశం, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్, కారోబార్ స్వామి,పంచాయతీ సిబ్బంది, కాంగ్రెస్ నాయకులు, చాట్ల భాస్కర్, చాట్ల ప్రశాంత్, వంశీధర్ రావు, లింగంపల్లి సత్తయ్య, భోగ భూమయ్య, ఎల్లయ్య,ప్రవీణ్,గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రహదారి నిబంధనలు పాటిద్దాం - సురక్షితంగా గమ్యాన్ని చేరుకుందాం

**ప్రజాపక్షం/రాయికల్ :** రహదారి నిబంధనలు పాటిద్దాం సురక్షితంగా గమ్యాన్ని చేరుకుందామని రాయికల్ ఎస్సై సుధీర్ రావు అన్నారు.తెలంగ్గాణ ప్రభుత్వ ఆదేశాల మేరకు, ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో సోమవారం రోడ్డు భద్రతపై అవగ్గాహన సదస్సును రాయికల్ పురపాలక సంఘం కార్యాలయంలో అరైవ్ అలైవ్ రోడ్డు భద్రతా వారోత్సవాల సదస్సును నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి గా రాయికల్ ఎస్సై సుధీర్ రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరుగుతున్న రహదారి ప్రమాదాలను అరికట్టడానికి వాహనదారులు విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారు నడిపే వారు సీట్ బెల్ట్ పెట్టుకోవాలని, మరియు అతి వేగాన్ని నియంత్రించుకోవాలని తెలిపారు.రోడ్డు భద్రత మనందరి బాధ్యత అనే నినాదంతో ప్రజల్లో మార్పు తీసుకురావడమే ఈ సదస్సు ముఖ్య ఉద్దేశమనిరహదారి నిబంధనలు పాటిద్దాం సురక్షితంగా గమ్యాన్ని చేరుకుందామని వివరించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ కట్కం రవీంధర్, మున్సిపల్ కమీషనర్ కీర్తి నాగరాజు,మున్సిపల్ కౌన్సిలర్ల్ తోపారపు ప్రశాంతి, కూనారపు మానస,వేముల మౌనిక,బత్తిని మహేశ్వరీ నాగరాజు,భూక్య రాకేష్ నాయక్ ,పల్లికొండ గంగాధర్,ఆర్.ఐ దేవదాస్, నాయకులు బత్తిని నాగరాజు,పురపాలక సిబ్బంది మరియు మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

# వేధింపులకు గురిచేస్తున్న డాక్టర్ భూమారెడ్డిపై చర్యలు తీసుకోవాలి

ప్రజాపక్షం / నిజామాబాద్ అర్బన్ :డాక్టర్ భూమారెడ్డి నాకు అనగా (బంటు రాముకుమార్)ల మధ్య 2024 నాటి లోక్ అదాలత్ ద్వారా పొందిన అర్డర్‌కు అనుగుణంగా భూమారెడ్డి నుండి పొందిన 24 గజాల స్థలంలో ఇంటి నిర్మాణం చేసుకుంటున్నా నాకు 2026 మార్చి నుండి వివిధ రకాల పేర్లతో వేధింపులకు గురిచేస్తున్న భూమారెడ్డిపై చట్ట ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని, తప్పుడు ఆరోపణలతో నన్ను మానసికంగా, నిజామాబాద్ మునిసిపల్ అధికారులతో పలు రకాలుగా వేధిస్తు, ఇంటి నిర్మాణం కొనసాగకుండా కోర్టు ఇచ్చిన అర్డర్‌ను సైతం లెక్క చేయని డాక్టర్ భూమారెడ్డిపై తగిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి కోరుకుంటున్నానని బాధితుడు బంటు రాము అన్నారు. సోమవారం నిజామాబాద్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నిజామాబాద్ లోక్ అదాలత్ కోర్టు ఇచ్చిన ఆర్డర్ మేరకు డాక్టర్ భూమారెడ్డి పొందిన 24 గజాల స్థలంలో ఇంటిని




నిర్మాణం కొనసాగించకుండా అడ్డంకులు ఏర్పరుస్తు ప్రతిరోజు మునిసిపల్ అధికారులతో ఏదో ఒక నెపంతో పనులు అడ్డగిస్తు నన్ను అనేక రకాలుగా మానసిక ఇబ్బందులకు గురిచేస్తున్న డాక్టర్ భూమారెడ్డి చర్యలను ఖండిస్తున్నానని, ఇకముందు ఇదే రకమైన వేధింపులకు గురిచేస్తే నా కుటుంబంతో సహా ఆత్మహత్యకు సిద్ధమవుతానని పత్రికా ముఖంగా తెలియజేస్తున్నాన్నారు. అంతేకాకుండా విజ్ఞులైన విలేకరులు యథార్థాన్ని గ్రహించి వార్తలు రాయాలని, ఆదివారం భూమారెడ్డి చెప్పిన కథనంతో కొన్ని పత్రికలలో తనపై బురద చల్లే చర్యలు జరిగాయని దీనిని ఖండిస్తున్నానని, ఇకముందు వాస్తవాలను తెలుసుకొని మిత్రులు సహకరించాలని కోరుకుంటున్నానన్నారు.

# కేజీబీవీలో అక్రమాలపై చర్యలు తీసుకోవాలంటూ ఫిర్యాదు

ప్రజాపక్షం/భీమ్‌గల్:ఏర్గట్ల కేజీబీవీలో ఇంగ్లీష్ సీఆర్‌టీగా పని చేస్తున్న బి.లావణ్య పాఠశాలలో 2025 జనవరి 20న విధుల్లో చేరగా జనవరి 10 నుంచి సంతకాలు అక్రమంగా నమోదు చేయటంతో ఫిర్యాదు చేశామన్నారు. 10 రోజుల వేతనానికి సంబంధించిన బిల్లులు ప్రాసెస్ చేసి సుమారు రూ.6 వేలు మొత్తాన్ని లావణ్య ఫోన్‌పే ద్వారా ఎస్ఓ సంధ్యకి పంపినట్లు ఆరోపించారు. ఈ విషయాన్నిగోప్యంగా ఉంచటంతో పాఠశాలలో అకౌంటెంట్‌గా విధులు నిర్వహిస్తున్న శాంతకు ఒక్క నైట్ డ్యూటీ కూడా వేయకుండా ఒప్పందం చేసుకున్నారు. పై విషయాలను జనవరిలోనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని ఆ సందర్భంలో జీసీడీఓ భాగ్యలక్ష్మీ విచారణకు వచ్చినప్పటికీ నామమాత్రంగానే తూతూ మంత్రంగా జరిగినట్లు ఫిర్యాదుదారులు తెలిపారు. తదుపరి ఫిబ్రవరిలో ఎన్నికలకు సంబంధించిన ఎన్నికల కోడ్ ఉండటంతో లిఖితపూర్వకంగా ఫిర్యాదులు అందజేసినప్పటికీ ఇప్పటివరకు సరైన విచారణ గానీ తదుపరి చర్యలు గానీ చేపట్టలేదన్నారు. 13 ఏప్రిల్‌న నిర్వహించిన ప్రజావాణిలో సంబంధిత అక్రమంగా నమోదు చేసిన అటెండెన్స్ రిజిస్ట్రర్ నకలు పత్రాలు, ఆధార ధృవపత్రాలతో ప్రతులను ఉపాధ్యాయ సిబ్బందిఅందరూ ఇంగ్లీష్ సీఆర్‌టీ జాయినింగ్ జనవరి 18 అని రాసిచ్చి ఇచ్చిన లెటర్‌ను కూడా జతపర్చి మరోసారి జిల్లా కలెక్టర్ కార్యాలయ ఉన్నతాధికారులకు ఫిర్యాదు అందజేసినట్లు నరేష్ తెలిపారు. ఈ అంశంపై సమగ్ర విచారణ జరిపించి ప్రభుత్వ ఖజానాను పక్కదారి పట్టించిన బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరినట్లు పేర్కొన్నారు.



## ప్రజావాణికి ఫిర్యాదులు

ప్రజాపక్షం/నిజామాబాద్:ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 124 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్‌తో పాటు సబ్‌కలెక్టర్ వికాస్ మహతో, జడ్పీ సీఈఓ సాయగౌడ్, డీఆర్‌డీఓ సాయన్నలకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ముగిసిన 10వ తరగతి పరీక్షలు

ప్రజాపక్షం/బాల్కొండ :మండలంలో పదవ తరగతి పరీక్షలు సోమవారం ముగిసాయనిమండల విద్యాధికారి తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా పరీక్షలు ముగిసాయన్నారు.

## ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా డాక్టర్ నాగమోహన్ బాధ్యతలు

ప్రజాపక్షం/నిజామాబాద్:జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా డాక్టర్ నాగమోహన్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణమోహన్, మెడికల్ కళాశాల అడ్మినిస్ట్రేటివ్ సూపరింటెండెంట్ నాగరాజుతో పాటు మెడికల్ కళాశాల సిబ్బంది ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సిబ్బంది ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ప్రభుత్వ ఆస్పత్రిని మెరుగుపర్చేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. జిల్లా ప్రజలకు మెరుగైన సేవలందేలా చర్యలు తీసుకుంటానన్నారు.

## కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాపక్షం/మోర్తాడ్:కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పీపీసీ మోర్తాడ్, పీపీసీ వడ్యాట్ గ్రామాలలో పిఐసి చైర్మన్ నల్ల రాజేశ్వర్ సూచించారు. సోమవారం నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండల కేంద్రంలో మోర్తాడ్ సొసైటీ ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాలను పిపిసి మోర్తాడ్ పిపిసి వడ్యాట్ గ్రామాలలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా నల్ల రాజేశ్వర్ మాట్లాడుతూ.. కేంద్రాల్లోనే రైతులకు గిట్టుబాటు ధర లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణ, ఎవో హరీష్, మోర్తాడ్ గ్రామ సర్పంచ్ బోగ ఆనంద్, ఉప సర్పంచ్ సామ శ్రీనివాస్, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, ఏఎంసి డైరెక్టర్ మహిపాల్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పుప్పాల అశోక్, జెడి పెద్ద గంగారాం, జెడి చిన్న గంగారాం, జె.నాగభూషణం, కొమిరే శ్రీధర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామ రైతులు, సంఘం కార్యదర్శి కాశీరాం, సంఘం సిబ్బంది పాల్గొన్నారు.

## మహిళల ఆర్థికాభివృద్ధికే కుట్టు శిక్షణ

ప్రజాపక్షం/ఎడపలి:మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించాలనే లక్ష్యంతో ఎడపల్లి మండలంలోని ఠాణాకలాన్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జల్ జీవన్ అండ్ ఉమెన్ ఎంపవర్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ కేంద్రంపై ఈ అవగాహన కల్పించారు. మహిళలకు నైపుణ్యాభివృద్ధిని అందించి, ఈ శిక్షణ ముఖ్య ఉద్దేశ్యమని నిర్వాహకులు తెలిపారు. కుట్టు పనిలో శిక్షణ పొందడం ద్వారా మహిళలు తమ ఇంటి వద్దే ఉపాధి పొందుతూ ఆర్థిక స్వతంత్రాన్ని సాధించవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఠాణాకలాన్ గ్రామ సర్పంచ్ అలేఖ్య శ్రీనివాస్, ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మహిళలు ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు కల్పిస్తున్న ఇటువంటి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆదిలక్ష్మి, కుట్టు మిషన్ ట్రైనర్ హరిత, గ్రామ మహిళలు, సంస్థ ప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## నూతన కార్యదర్శిగా శ్రీనివాస్

ప్రజాపక్షం/ముప్కాల్:ముప్కాల్ గ్రామపంచాయతీ నూతన కార్యదర్శిగా శ్రీనివాస్ సోమవారం విధుల్లో చేరారు. ఈ సందర్భంగా గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో స్వాగతం పలికామన్నారు. అదేవిధంగా స్వంచ్ కొమ్ముల సాయమ్మను మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో ఘనంగా సన్మానించామన్నారు. కార్యక్రమంలో గ్రామాభివృద్ధిఅధ్యక్షులు, సభ్యులు, గ్రామపెద్దలు,పాల్గొన్నారు.

## బ్యాంకు మేనేజర్ సన్మానం

ప్రజాపక్షం/బాల్కొండ :ఆర్థిక అక్షరాస్యతపై విద్యార్థులకు అవగాహనలో భాగంగా సోమవారం ఎస్‌బిఐ వన్నెల్(బి) బ్యాంకు మేనేజర్ సురేందర్‌ను ఘనంగా సన్మానించామని ప్రధానోపాధ్యాయులు సురేందర్ తెలిపారు. విద్యార్థులకు బ్యాంకింగ్ రంగంపై అవగాహన కల్పిస్తూ ముందుకెళ్లాలని సూచించటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సిఎం సహాయనిధి చెక్కు అందజేత

ప్రజాపక్షం/నిజాంసాగర్: మండలంలోని మల్లూరు గ్రామానికి చెందిన కుర్మ గంగారాం కుటుంబానికి స్థానిక నాయకులు ప్రజాపండరి సోమవారం అందజేశారు. మండలంలోని మల్లూఊజుల క్రీతం అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. వారి కుటుంబానికి ఆర్థికంగా అండగా నిలిచేందుకు సీఎం సహాయనిధి ద్వారా మంజూరైన 26000ల రూపాయల చెక్కును మృతుని భార్య సాయవ్వకు చెక్కు అందజేశారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు రాములురాథోడ్, గ్రామ అధ్యక్షుడు, , ఇతర నాయకులు పాల్గొన్నారు.

## వడదెబ్బ తలగకుండా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి



ప్రజాపక్షం/పెద్దపల్లి: జిల్లాలో రోజురోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతల నేపథ్యంలో ఎండ (వడదెబ్బ) కారణంగా కలిగే అనారోగ్య సమస్యలు మరియు మరణాలను నివారించేందుకు ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వైద్య అధికారి డాక్టర్ ప్రమోద్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయనప్రజలకు పలు సూచనలు చేశారు.మధ్యాహ్నం 12 గంటల నుండి 3 గంటల వరకు అత్యవసరం అయితే తప్ప బయటకు వెళ్లకుండా ఉండాలని,బయటకు వెళ్లేటప్పుడు తలపై గుడ్డ/టోపీ లేదా గొడుగు వాడాలని,తరచుగా నీరు, ORS, మజ్జిగ, కొబ్బరి నీరు వంటి ద్రవాలు తీసుకోవాలనీ, తేలికపాటి, పలుచని, లేత రంగు దుస్తులు ధరించాలనీ, పిల్లలు, వృద్ధులు, గర్భిణీలు ఎక్కువగా జాగ్రత్తగా ఉండాలనీ,ఎండలో ఎక్కువసేపు పని చేయకుండా మధ్య మధ్యలో విశ్రాంతి తీసుకోవాలనీ, బయట నిలిపిన వాహనాల్లో పిల్లలను ఒంటరిగా వదిలేయకూడదనీ,మద్యం, అధిక కాఫీ, టీ వంటి పానీయాలు తగ్గించాలనీ తెలిపారు.

**వడదెబ్బ లక్షణాలు:**అధిక జ్వరం (శరీర ఉష్ణోగ్రత పెరగడం)తలనొప్పి,తల తిరగడం వాంతులు, అలసటచర్మం ఎర్రబడడం, చెమటలు ఆగిపోవడం ఈ లక్షణాలు కనిపించిన వెంటనే సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి చికిత్స పొందాలని సూచించారు.జిల్లాలోని అన్ని ఆరోగ్య కేంద్రాల్లో హీట్ స్ట్రోక్ చికిత్సకు అవసరమైన సౌకర్యాలు,ORS, మందులు సిద్ధంగా ఉంచబడినట్లు తెలిపారు.ప్రజలు అప్రమత్తంగా ఉండి, చిన్న జాగ్రత్తలతోనే వడదెబ్బ ప్రమాదాలను నివారించవచ్చని జిల్లా వైద్య అధికారి డాక్టర్ ప్రమోద్ కుమార్ పేర్కొన్నారు.

# హత్యకేసులో నిందితుడి అరెస్ట్

ప్రజాపక్షం/మాక్లూర్ :మండలంలోని మెట్టు గ్రామానికి చెందిన ఆంటోని మెట్టు గ్రామ శివారులోని పొర్కు సమీపంలో గాయాలతో మృతదేహంగా కనిపించగా వెంటనే హత్య కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. నార్త్ రూరల్ సిఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎస్సైలు రాజశేఖర్, మొగులయ్యలు విచారణ ప్రారంభించారు. విచారణలో భాగంగా మెట్టు గ్రామానికి చెందిన అనుమానితుడు ఫ్రాన్సిస్ కుమార్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా ఈనెల 10న రాత్రి ఆంటోని కలిసి మద్యం సేవిస్తున్న సమయంలో ఆంటోని తనను దూషించటంతో ఇద్దరి మధ్య గొడవ చోటు చేసుకున్నట్లు వెల్లడించాడు. ఆ గొడవలో ఫ్రాన్సిస్ రాయితో ఆంటోని తలపై బలంగా కొట్టడంతో అతనికి తీవ్ర గాయాలు కలిగాయి. అనంతరం అతన్ని కొంత దూరం ఈడ్చుకుంటూ వెళ్లినట్లు తెలిపారు. ఈ ఘటనలో గాయాలతో ఆంటోని అక్కడికక్కడే మృతి చెందగా, ఫ్రాన్సిస్ ఎవరికీ అనుమానం రాకుండా అక్కడి నుండి పరారయ్యాడు. ఈ రోజు అతని ఇంటి వద్ద పట్టుకుని విచారించగా హత్య చేసినట్లు ఒప్పుకున్నాడు. నిందితుని వద్ద నుండి బండరాయి, దుస్తులు స్వాధీనం చేసుకుని అతనిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సిఐ శ్రీనివాస్, ఎస్సై రాజశేఖర్ తెలిపారు.




## పేరిణి నాట్యం ఉచిత వేసవి శిక్షణ శిబిరం పోస్టర్ల ఆవిష్కరణ

ప్రజాపక్షం/నిజామాబాద్:భాషా సాంస్కృతిక తెలంగాణ ప్రభుత్వం, భీమన్ నృత్యనికేతన్ ఆధ్వర్యంలో నిజామాబాద్‌లో సిరికొండ, భీమ్‌గల్ ప్రాంతాల్లో పేరిణి నాట్యం ఉచిత వేసవి శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నామని భీమన్ నృత్యానికేతన్ స్థాపకులు అన్నెలాదేవి రాజేష్ తెలిపారు. ఈ బ్రోచర్‌ను జిల్లా కలెక్టర్ త్రిపాఠి చేతుల మీదుగా ఆవిష్కరించినట్లు తెలిపారు. ఈ శిక్షణను అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 9393994141 ను సంప్రదించాలని కోరారు.